ప్రజాశక్తి
మంగళవారం 27 జూన్ 2023
8 పేజీలు
ఎన్‌టిఆర్
కృష్ణా





యువ న్యాయవాదులకు ఆర్థిక చేయూత

కలెక్టర్లు డిల్లీరావు, రాజాబాబు


విజయవాడలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు

ప్రజాశక్తి - విజయవాడ, కలెక్టరేట్ (కృష్ణా) : వైఎస్సార్ లా నేస్తం జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక భరోసాగా నిలిచి న్యాయవాది వత్తిలో స్థిరపడేందుకు ఉపయోగపడుతుందని ఎన్‌టిఆర్, కృష్ణాజిల్లాల కలెక్టర్లు ఎస్.ఢిల్లీరావు, పి.రాజాబాబు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తాడేపల్లి క్యాంప్ కార్యాలయం నుండి సోమవారం మూడో విడత జూనియర్ న్యాయవాదులకు ఆర్థిక చేయూతను అందించే వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, ప్రజాప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఎన్టీఆర్ జిల్లా నుండి కలెక్టర్ కార్యాలయం కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు, మచిలీపట్నంలోని కలెక్టర్ కార్యాలయం నుండి కలెక్టర్ పి.రాజారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ డిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో 182 మంది న్యాయవాదులు ఈ పథకం ద్వారా 44 లక్షల 60 వేల రూపాయల లబ్ది పొందుతున్నారని, వీరిలో 42 మంది షెడ్యూల్ కులానికి, 13 మంది షెడ్యూల్ తెగలకు (మిగతా 6లో)

మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు


అద్దెలతో పోటీగా కరెంటు బిల్లులు




కృష్ణాజిల్లా వినియోగదారులపై రూ.140 కోట్లకుపైగా భారం

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై ఎడాపెడా భారాలు మోపుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ అడుగులకు మడుగులొత్తుతూ చెత్త పన్ను, ఆస్తి పన్ను విధింపుల్లో మార్పులు చేస్తూ ఇప్పటికే ప్రజలపై భారాలు మోపిన రాష్ట్ర ప్రభుత్వం తాజాగా వినాశకర విద్యుత్ సంస్కరణల అమలులో భాగంగా ట్రూ అప్, సర్దుబాటు ఛార్జీలు (ఫ్యూయల్ అండ్ పవర్ పర్చేజ్ కాస్టు అడ్జస్టుమెంట్ -ఎఫ్‌పిపిసి) పేరుతో విద్యుత్ వినియోగదారులపై విపరీతంగా భారాలు మోపింది. దీంతో అద్దె గృహాల్లో ఉంటున్న వినియోగదారులకు అద్దెతో పోటీగా విద్యుత్ బిల్లులు వస్తున్నాయి. ఏప్రిల్, మే నెలల్లో పెరిగిన విద్యుత్ బిల్లులు చూసి పేదలు, మధ్యతరగతి వినియోగదారులు బేజారెత్తిపోతున్నారు.

కృష్ణాజిల్లా వినియోగదారులపై రూ.140 కోట్లకుపైగా భారం


వినియోగదారుడు వేణు


ఎపిసిపిడిసిఎల్
విద్యుత్ వినియోగదారుల బిల్లు/నోటీసు
ORIGINAL
424410
622005044
11/05/2023 11:05
MACHILIPAT
D1 MTM SOU
RAJU PET
6222218069389
069389 M1
05/2023-04/2023
THOKALA.SURESH
181.00
1619.00
0.00
100.00
0.00
0.00
1900.00
Nine Zero Zero

వేణుకు వచ్చిన బిల్లు


వినియోగదారుడు కిరణ్

విద్యుత్ వినియోగదారులపై స్థిర ఛార్జీలు, వినియోగ ఛార్జీలు, విద్యుత్ డ్యూటీ, ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు ఛార్జీల (2021 మేకు సంబంధించి ఏప్రిల్ నుంచి జూన్ 21 వరకు యూనిట్‌కు 20 పైసలు, జులై నుంచి సెప్టెంబర్ మధ్య కాలంలో యూనిట్‌కు 63 పైసలు, అక్టోబర్ నుంచి డిసెంబర్ వరకు 57 పైసలు, జనవరి 22 నుంచి మార్చి 22 వరకు 66 పైసలు, 23 ఏప్రిల్‌కు రూ.40 పైసలు అదనపు భారం) భారం మోపారు. గతంలో విద్యుత్ ఉత్పత్తి వ్యయానికి, పంపిణీ, వసూళ్ళకు మధ్య ఉన్న తేడాను పూడ్చుకోవడానికి ఈ ఛార్జీలు మోపినట్లు ప్రభుత్వం చెపుతోంది. గత వినియోగానికి సంబంధించి తాజాగా వసూలు చేస్తుండడంతో వినియోగదారులపై ఈ భారం పడుతోంది. ఛార్జీల (మిగతా 6లో)

ఎసిబి దాడులు

రూ.75 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడ్డ గుడివాడ రూరల్ సిఐ

ప్రజాశక్తి - గుడివాడ : కృష్ణాజిల్లా గుడివాడలోని రూరల్ పోలీస్ సర్కిల్ కార్యాలయంపై సోమవారం అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు దాడులు నిర్వహించారు. డిజిపి కె.వి. రాజేంద్రనాథ్ రెడ్డి ఆదేశాల మేరకు ఎసిబి 14400 కాల్ సెంటర్ ద్వారా అవినీతి అధికారిపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ దాడులు జరిగాయి. ఎసిబి అధికారుల కథనం ప్రకారం....కష్ణా జిల్లా గుడివాడ పెదఎరుకపాడు గ్రామానికి చెందిన బాధితుడు కందుల రవి కుమార్‌ను ఓ కేసులో అరెస్టు చేయకుండా 41 (మిగతా 6లో)



ఎసిబి అధికారుల దాడుల్లో పట్టుబడిన సిఐ జయకుమార్, హోంగార్డ్ సనవుల్లా

అంతిమయాత్ర దృశ్యం


వార్తలు మెయిన్, టాబ్లాయిడ్ లోపలి పేజీల్లో

జర్నలిస్ట్ ఉద్యమ నేత అంబటికి నివాళి

అత్యాశకు పోతే...

బ్యాంక్ ఖాతాలు ఖాళీ!



- ఆన్‌లైన్లో బురిడీ కొట్టిస్తున్న ఫ్రాడ్‌స్టర్లు
- ఆఫర్ల పేరుతో ఆకర్షిస్తున్న మోసగాళ్లు
- ఈజీ మనీ కోసం ఉచ్చుల్లో చిక్కుకుంటున్న వైనం

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

అత్యాశకు పోయి ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకుంటున్న కేసులు ఇటీవల కాలంలో అధికమయ్యాయి. సులువుగా డబ్బులు సంపాదించొచ్చని అత్యాశకు పోయిన విజయవాడకి చెందిన ఓ యువకుడు చేతులు కాల్చుకున్నాడు. తన అమాయకత్వాన్ని, అత్యాశను ఆసరాగా చేసుకున్న మాయగాళ్లు ఆ యువకుని బ్యాంక్ ఖాతాను ఊడ్చేశారు. అకౌంట్‌లోని దాదాపు రూ.11 లక్షలు కొట్టేశారు. చివరకు మోసపోయామని గ్రహించిన ఆ యువకుడు శుక్రవారం నగరంలోని సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించాడు. అలాంటి కేసే మరొకటి నాలుగు రోజుల క్రితం వెలుగులోకి వచ్చింది. అధిక మొత్తంలో సంపాదించొచ్చని మరో యువకుడు కేటుగాళ్ల బుట్టలో పడ్డాడు. మాయగాళ్లు అతడిని బురిడీ కొట్టించి దాదాపు రూ.8 లక్షల వరకు లాగేసుకున్నారు. ఆఖరికి చీటింగ్‌కి గురయ్యానని తెలుసుకున్న అతను లబోదిబోమంటూ బుధవారం పోలీసులను ఆశ్రయించాడు. సులువుగా ఇంట్లో ఉండి డబ్బులు సంపాదించాలని ఆశ పడ్డ మరో యువతి మోసగాళ్ల బారిన పడి ఏకంగా రూ.48 లక్షలు పోగొట్టుకుంది. బాధితురాలు గుంటూరుకు చెందిన వారు కావడంతో అక్కడే కేసు నమోదు చేయాలని సూచించడంతో ఆమె గుంటూరు వెళ్లారు. గత మాసంలో ఓ యువతికి చెందిన రూ.20 లక్షలను ఇదే విధంగా కొట్టేశారు. ఈ తరహా కేసులు ఈ మధ్య కాలంలో పెరుగుతున్నాయి. సగటున వారానికి రెండు మూడు కేసులు తెరపైకి వస్తున్నాయి. ప్రధానంగా ఇన్వెస్ట్‌మెంట్ తరహా మోసాలు, ఆధార్, పాన్ నంబర్‌తో బ్యాంక్ ఖాతాల్లోని నగదును దొంగిలించే ఫ్రాడ్‌లు, లోన్‌యాప్‌ల దారుణాలు వంటి మూడు రకాల కేసులు పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. గత మూడేళ్ల గణాంకాలు కూడా ఇదే అంశాన్ని ధృవీకరిస్తున్నాయి. 2021లో సుమారు 46 కేసులు తెరపైకి రాగా, వాటి సంఖ్య 2022లో పెరిగింది. దాదాపు 57 కేసులకు చేరింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు దాదాపు 33 కేసుల వరకు నమోదైనట్టు తెలిసింది. రానున్న రోజుల్లో ఈ తరహా కేసులు మరింతగా పెరిగే ప్రమాదం ఉందని పోలీసులు అంచనా వేస్తున్నారు. అయితే ఇప్పటి వరకు సుమారు 9 కేసుల్లో నిందితులను గుర్తించి రిమాండ్‌కు పంపినట్లు సమాచారం.

ఖాతాలు బ్లాక్

మోసగాళ్ల మాయలో పడి రెండు లక్షలు, అంత కంటే ఎక్కువ మొత్తాల్లో నగదు పోగొట్టుకున్న కేసులను విజయవాడ సైబర్ పోలీసులు టేకప్ చేస్తున్నారు. అంతకంటే తక్కువ మొత్తాల్లో మోసాలకు గురైన వారిని స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచిస్తున్నారు. అయితే తొలుత ఎవరు వచ్చినా వారించకుండా ఇంకా మోసానికి గురి కాకుండా రక్షణ చర్యలు తీసుకుంటున్నారు. వారి వివరాలను తీసుకొని బాధితుల బ్యాంక్ ఖాతాలను బ్లాక్ చేయడం, లావాదేవీలను నిలుపుదల చేయడం వంటివి చేస్తున్నారు. దీని కోసం నలుగురు సిబ్బందిని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. అనంతరం స్థానిక పోలీస్ స్టేషన్లకు ఆ కేసులను బదిలీ చేస్తున్నారు. బాధితుల్లో అధిక శాతం మంది యువతే ఉంటున్నారు. ఆఫర్లకు తొందరగా ఆకర్షితులై ఖాతాలు ఖాళీ చేసుకుంటున్నారు. బిటెక్, డిగ్రీలు, పిజిలు చేసిన వారు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా మోసపోతున్నవారిలో ఉంటుంన్నారు. వస్తున్న కేసుల్లో 90 శాతం వీరే ఉంటున్నారు.

అత్యాశ వద్దు : పి.సత్యానందం, సైబర్ క్రైమ్ సిఐ

అత్యాశకు పోవడంతో అనేక మంది బాధితులుగా మారుతున్నారు. సులువుగా సంపాదించాలనే అత్యాశ మంచిది కాదు. ఆ ఆలోచనా ధోరణి నుంచి యువత బయట పడాలి. ఫ్రాడ్‌స్టర్లు ఎక్కడక్కడ నుంచే ఆపరేట్ చేస్తుంటారు. వీరిని ట్రేస్‌అవుట్ చేయడం చాలా కష్టం. ఈజీ మని ఉచ్చులో పడొద్దు. వారి బారిన పడి డబ్బులు పోగొట్టుకోవద్దు.

బ్లాక్‌లో పత్తి విత్తనాలు... పత్తాలేని అధికారులు

ప్రజాశక్తి-నందిగామ: తొలకరిలో వర్షాలు పడి వ్యవసాయ ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావటంతో రైతులంగా విత్తనాలు కోసం ఎగబడుతుండటంతో వ్యాపారులు పత్తి విత్తనాలు కృత్రిమ కొరత సృష్టించి బ్లాక్‌లో అమ్ముతున్నా అధికారులు పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. బోల్‌గార్డు యుఎస్ అగ్రిటెక్ 7067 పత్తి విత్తనాల కోసం రైతులు ఉరుకులు పరుగులు తీస్తున్నారు. ఈ విత్తనాల ప్యాకెట్ ధర రూ850 ఉండగా బ్లాక్ మార్కెట్‌లో రూ.1500కు పైగా ధర పలుకుతుంది. గత ఏడాది ఈ విత్తనం వేసిన రైతాంగానికి దిగుబడులు పెరగటంతో రైతులు ఎరువుల షాపుల చుట్టూ తిరుగుతున్నారు. రైతులకు కావాల్సిన విత్తనాలు ఉత్పత్తి పెంచటంలో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో ఎరువుల షాపులు యజమానులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. నూజివీడు బన్ని విత్తనం కూడా రైతులకు అందుబాటులో ఉండటం లేదు.

వర్షాలు ముమ్మరంగా పడుతుండటంతో రైతులు పంట పొలాలు దుక్కులు దున్ని విత్తనాలు వేసుకోవటానికి సిద్ధమైన తరుణంలో విత్తనాలు అందుబాటులో లేకపోవటం, వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించటం పలు విమర్శలకు తావిస్తుంది. ఎన్‌టిఆర్ జిల్లాలో నందిగామ, జగ్గయ్యపేట, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల్లో కోట్లాది రూపాయల్లో విత్తనాల వ్యాపారం జరుగుతుంది. కొంత మంది విత్తనాల వ్యాపారులు లైసెన్సులు రెన్యువల్స్ చేయించుకోవటం లేదు. స్టాక్ రిజిష్టర్లు సక్రమంగా మెయింటెన్స్ చేయటం లేదు. విత్తనాలు, ఎరువుల ధరలు పట్టికలు షాపుల ముందు బహిరంగంగా పెట్టి విక్రయించాల్సి ఉండగా,



అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తూ ఇష్టారాజ్యంగా విత్తనాలు బ్లాక్‌లో అమ్ముతున్నారు. విత్తనాలు అమ్మే సమయంలో బిల్లులు, బ్యాచ్ నెంబర్లు కూడా రాయకుండా డూప్లికేట్లు బిల్లులు ఇచ్చి రైతులను మోసం చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో సుమారు లక్షన్నర యకరాల్లో పత్తి సాగు అవుతుంది. ముఖ్యంగా నందిగామ,జగ్గయ్యపేట నియోజకవర్గాలోనే సుమారు 70 వేల యకరాల్లో పత్తి సాగు అవుతుంది. పత్తికి మార్కెట్‌లో ధర ఆశాజనకంగా ఉండటంతో గత ఏడాది కంటే ఈ ఏడాది రెట్టింపు స్థాయిలో పత్తి సాగు చేపట్టడానికి రైతులు సిద్ధమవుతున్నారు.

పట్టించుకోని అధికారులు

పత్తి విత్తనాలకు కృత్రిమ కొరత ఏర్పడి బ్లాక్‌లో అమ్ముతున్నా వ్యవసాయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. విజిలెన్సు దాడులు మొక్కుబడిగా నిర్వహిస్తున్నారు. గత నెలలో విజిలెన్సు అధికారులు ఒకరోజు వచ్చి తూ తూ మంత్రంగా షాపులు తనిఖీలు చేసి వ్యాపారుల వద్ద మాముళ్లు తీసుకుని క్లిన్ చిట్ ఇచ్చివెళ్ళారు. వాస్తంగా నందిగామలో ప్రతి విత్తనాల వ్యాపారి పత్తి విత్తనాలు బ్లాక్‌లో అమ్ముతున్నట్లు సమాచారం. నందిగామలో ఒక్కొక్క విత్తనాల వ్యాపారి కోట్ల రూపాయలల్లో విత్తనాల వ్యాపారం చేస్తూ విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారు. నందిగామ పాతబస్టాండు సెంటరు, కూరగాయల బజారు సెంటరు,మెయిన్‌బజారులో పత్తి విత్తనాలు వ్యాపారం జోరుగా సాగుతుంది. స్థానిక అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ విత్తనాలు వ్యాపారులపై కనీసం చర్యలు తీసుకోవటం లేదని రైతుల నుండి విమర్శలు వ్యక్తమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పత్తి విత్తనాలు బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.

బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలి

కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు

ఖరీఫ్ సీజన్‌లో పత్తి విత్తనాలు బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కౌలు రైతుసంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు డిమాండ్ చేశారు. వ్యవసాయ సీజన్ ఒక్కసారిగా ప్రారంభం కావటంతో రైతులు విత్తనాల కోసం ఒక్కసారిగా ఎగబడటం, వ్యాపారులు విత్తనాలు బ్లాక్ చేసి అమ్ముతున్నారు. బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పట్టించుకోకపోవటంతో రైతులు నష్టపోతున్నారు. అధికారులు స్పందించి పత్తి విత్తనాలు బ్లాక్‌లో అమ్మకుండా స్టాకు రిజిష్టరు పరిశీలించాలని, బిల్లు బుక్కులు చెక్ చేయించాలని, బ్లాక్‌లో అమ్మే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు అందించాలి : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ అధ్వర్యంలో సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.సోమేశ్వరరావు, సి.హెచ్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థలు ప్రారంభమై 20 రోజులు పూర్తయిందని,. ప్రభుత్వం నేటికీ ఇంటర్మీడియట్ విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు ఇవ్వలేదన్నారు. కాలేజి లో చదువు చెప్పే అధ్యాపకులు పూర్తి స్థాయిలో లేరని. మౌలిక సదుపాయాలు, మంచినీరు లేవు అని, ఈసమస్యలన్నీ అధిగమించి విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని, కావున ఈ సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలనీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అధ్యాపకులు లేకుండా చదువెలా వస్తుంది చెప్పాలని. ఇంటర్మీడియట్ కళాశాలలో రాష్ట్రవ్యాప్తంగా 474 ప్రభుత్వ జూనియర్, కె.జి.బి.వి, గురుకులాలు, మోడల్ కళాశాలలు ఉన్నాయిని లక్షలాది మంది విద్యార్థులు ఈ కళాశాలలో విద్యను అభ్యసిస్తున్నారన్నారు. 210 కాలేజీల్లో ప్రిన్సిపల్స్ లేరు. ఆ కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ గా ఉన్న అధ్యాపకులే ప్రిన్సిపల్ బాధ్యతలు వహిస్తున్నారని తెలిపారు. దీనివల్ల ఇంటర్మీడియట్ అడ్మినిస్ట్రేషన్ సిలబస్ ప్రణాళిక తూతూ మంత్రంగా నడుస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 2500 మంది అధ్యాపకులు ఖాళీగా ఉన్నాయి. టీచర్ లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఎన్టీఆర్ జిల్లాలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సుమారుగా ఐదు వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు కుమారస్వామి, నగర కమిటీ సభ్యులు భార్గవ్, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ: నగరంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విఎంసి అధికారులను నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. సింగ్‌నగర్ ఎక్సెల్‌ప్లాంట్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను సోమవారం కమిషనర్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. ప్లాంట్ ఆవరణలో ఆహ్లాదకరంగా ఇండస్ట్రియల్ వాతావరణ కలిగి ఉండే విధంగా గ్రీనరీని అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రసాద్, ఏడిహెచ్ శ్రీనివాసు పాల్గొన్నారు.

విఎంసి అక్రమాలపై సమగ్ర విచారణ : టిడిపి

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ నగరపాలక సంస్థ ఆదాయానికి భారీ స్థాయిలో గండికొట్టడమే గాక, అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న నగర మేయర్ రాయన బాగ్యలక్ష్మి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాసరావు బాధ్యత వహించి, తక్షణమే రాజీనామా చేయాలని టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి డిమాండ్ చేశారు. ఆ పార్టీ కార్పొరేటర్లు ఉమ్మడి వెంకటేశ్వరరావు, ముమ్మనేని వెంకటప్రసాద్, పొట్లూరి శివసాయి ప్రసాద్‌తో కలిసి తన ఛాంబర్‌లో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. విఎంసి టెండర్ల దగ్గర నుంచి పార్కింగ్ ఫీజులు, కాంప్లెక్స్ లీజులు ఇలా అన్ని అంశాల్లో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌తో పాటు నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మీ వారి వారి అనుయాయులకు కట్టబెడుతూ భారీ మొత్తంలో విఎంసి రాబడికి గండికొడ్తున్నారని పేర్కొన్నారు. సింగిల్ టెండర్ వస్తే విఎంసి నిబంధనల ప్రకారం ఇవ్వరని, మేయర్ బంధువు అయిన రాయన ప్రవీణ్‌కుమార్‌తో మరొక టెండర్ పత్రాన్ని దాఖలు చేయించి, 5.53 లక్షలకు తోడు మరో రూ,20 వేలు అదనంగా చూపించి, టెండర్‌ను స్వాధీనం చేసుకున్నారని అన్నారు. ఈ టెండర్‌కు సంబంధించి లీడింగ్ పత్రికలో ప్రకటన ఇవ్వాల్సిన విఎంసి అధికారులు చిన్న పత్రికలో ఇచ్చారని, మేయర్, ఎమ్మెల్యే ఈ టెండర్ వ్యవహారంలో భారీ స్థాయిలోనే విఎంసి రాబడికి గండికొట్టారని ఆరోపించారు. ఈ క్రమంలో విఎంసిలో నడుస్తున్న అవినీతి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.



పేదలకు సంక్షేమ పథకాలు : విష్ణు

ప్రజాశక్తి-విజయవాడ: రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమం కోసం పలు పథకాలను అమలు చేస్తుందని ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 1 వ డివిజన్ 238వ వార్డు సచివాలయ పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం జరిగింది. ప్రెస్ వీధిలోని ఖాళీస్థలాలలో పాములు, పురుగులు చేరకుండా పిచ్చిమొక్కలు, చెత్తను తొలగించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. మ్యాన్ హెూల్స్ నుంచి మురుగు బయటకు పొంగకుండా.. భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వీఎంసీ అధికారులకు చెప్పారు. ఎక్కడా తాగునీటి పైపులైన్ల లీకులు లేకుండా చూడాలని తెలియజేశారు. అలాగే ఇళ్లల్లోకి, మురుగు కాల్వలలో ఉన్న విద్యుత్ స్తంభాలను తక్షణమే తొలగించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఉద్దంటి సునీత, డీఈలు గురునాథం, రామకష్ణ, సీడీఓ జగదీశ్వరి, 29వ డివిజన్ కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతి, సురేష్, పాల్గొన్నారు.

నగర పరిశుభ్రతకు సహకరించాలి

ప్రజాశక్తి-విజయవాడ: వ్యాధులు, దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి సైకిళ్ల ద్వారా ఏర్పాటు చేసిన ప్రచార కార్యక్రమానికి జెండా ఊపి నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వర్షాకాలం దోమకాటు వల్ల సంక్రమించు వ్యాధులు, దోమల వృద్ధి చెందకుండా ముందస్తు జాగ్రత్తలపైప్రజల్లో అవగాహన కల్పించడానికి నగరంలోని 64 డివిజన్లకు ప్రజారోగ్య విభాగం సిబ్బంది మైక్ ఎనౌన్స్ ద్వారా ప్రచారం నిర్వహించడం జరుగుతుందన్నారు. స్వచ్ఛ్ సర్వేక్షన్- 2023లో మొదటి ర్యాంక్ లక్ష్యంగా నగర పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎసి ప్రాజెక్టుకెవి సత్యవతి , సిఎంఒహెచ్ డాక్టర్ పి రత్నావళి , బయాలజిస్ట్ సూర్య కుమార్ వెహికల్ డిపో ఎఇ ఏసుపాదం, శానిటరీ సూపర్‌వైజర్లు, మలేరియా ఇనిస్పెక్టర్లు పాల్గొన్నారు.





పూడికతీత పనుల పరిశీలన

ప్రజాశక్తి-జగ్గయ్యపేట

పట్టణ ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న మేజర్ డ్రైన్ల పూడిక తీత పనులు చేపట్టినట్లుగా మున్సిపల్ కమిషనర్ సిహెచ్ మల్లేశ్వర రావు తెలిపారు. సోమవారం డ్రైన్ల పూడికతీత పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ రానున్న వర్షాకాలం దష్ట్యా శాసన సభ్యులు మరియు ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను మరియు మున్సిపల్ చైర్ పర్సన్ రంగాపురం రాఘవేంద్ర సూచనల మేరకు పట్టణంలో ఈ పూడికతీత పనులు చేపట్టినట్లుగా తెలిపారు. విజయవాడ రోడ్డు, కోదాడ రోడ్డు, ముక్త్యాల రోడ్డు మొదలగు ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న షాపు యాజమానదారులు వారు ఏర్పాటు చేసుకున్న బండరాళ్ళను డ్రైన్ పూడికతీత సమయంలో తొలగించుటకు పురపాలక సంఘం వారికి సహకరించలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ కె. దుర్గాప్రసాద్, డి ఈ శివ కోటేశ్వర రావు, ఏ ఈ హనుమంతరావు పాల్గొన్నారు.

దళితులకు న్యాయం జరిగే వరకూ పోరాటం



ప్రజాశక్తి-వత్సవాయి: వత్సవాయి మండలం భీమవరం గ్రామానికి చెందిన దళితులు వందల ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని వారి వద్ద నుండి ప్రభుత్వం తీసుకునే ప్రయత్నం చేస్తుంది దానిని దళితులు వ్యతిరేకిస్తున్నారని వారికి న్యాయం జరిగిన తర్వాతనే భూములు ఇస్తాం లేకపోతే ఇవ్వమని వారు సాగు చేసుకునే భూమి వద్దనే నిరసన తెలియజేస్తున్నారు. వారికి టిడిపి జాతీయ కోశాధికారి, మాజీ ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ సోమవారం మద్దతు తెలిపి దళితులు పక్షాన నిలబడ్డారు. ఈ సందర్భంగా రాజగోపాల్ మాట్లాడుతూ వందల సంవత్సరాలుగా సాగు చేసుకుంటున్నాటువంటి దళితుల భూమిని ప్రభుత్వం తీసుకోవడం సరికాదు వారికి న్యాయం చేసిన తర్వాతే తీసుకోవాలని అప్పటివరకు భూమిని తీసుకోవద్దని ప్రభుత్వాన్ని కోరారు. దళితులు ఎటువంటి కార్యక్రమం చేపట్టిన వారికి తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుంది వారికి న్యాయం జరిగే వరకూ వారి వెంటే ఉండి న్యాయపోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమవరం గ్రామ టిడిపి నాయకులు ఇంజం రామారావు, షేక్ మజీద్, వంగూరి కోటేశ్వరరావు, షేక్ ఖాసిం అలీ, గడ్డిపర్తి రాంబాబు, మేడి సుందర రావు, కారుపాటి వెంకయ్య, వేమవరపు రాజు, కొండేటి కొండ, మాసారపు వెంకటేశ్, గడ్డిపర్తి అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

3న నెమలి వేణుగోపాలస్వామి కల్యాణం

ప్రజాశక్తి-గంపలగూడెం

వచ్చే నెల మూడో తేదీ సోమవారం గంపలగూడెంలో కొల్లా రమణాదం మిల్లు ఆవరణలో నెమలి శ్రీ వేణుగోపాలస్వామి వారి కళ్యాణం జరుగుతున్నట్లు మండల ఆర్యవైశ్య సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది. గురు పౌర్ణమి పురస్కరించుకొని ఈ కళ్యాణ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. కల్యాణంలో పీఠలపై కూర్చునే దంపతులు ఈనెల 29 సాయంత్రానికి పేర్లను సంఘానికి తెలపాలని పేర్కొన్నారు.

కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో కుష్ట వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమాన్ని సజావుగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు వైద్యాధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో స్పందన కార్యక్రమం సందర్భంగా జాతీయ కుష్ట నిర్మూలన కార్యక్రమంలో భాగంగా కుష్ట వ్యాధి చిహ్నాలు, లక్షణాలను తెలియజేసే గోడపత్రాలను కరపత్రాలను జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్ తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ కుష్ట నిర్మూలన కార్యక్రమంలో భాగంగా ఈనెల 26వ తేదీ సోమవారం నుండి వచ్చే జులై నెల 16వ తేదీ వరకు కుష్ట వ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమం చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఇంటి వద్దకు ఆరోగ్య కార్యకర్తలు సర్వే చేయడానికి వస్తారని ఎవరైనా అనుమానిత లక్షణాలు ఉంటే వారికి చూపించి తగిన చికిత్స పొందాలన్నారు. అలాగే అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఆరోగ్య కార్యకర్తల వద్ద ఎం.డి.టి. మందులు ఉచితంగా లభిస్తాయని కలెక్టర్ చెప్పారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు,



డిఎంహెచ్వో డాక్టర్ గీతాబాయి, ఆర్డిఓ ఐ. కిషోర్, కే ఆర్ ఆర్ సి ఎస్డిసి శివ నారాయణరెడ్డి, ఎయిడ్స్ టీబి అధికారి వెంకట్రావు తదితర అధికారులు పాల్గొన్నారు.



సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గన్నవరం : విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో సుమారు 4 కోట్ల 20 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న వాటర్ ట్యాంక్,సీసీ రోడ్లు, కల్వర్టులకు గన్నవరం ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ శంఖుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ మాదు శివరామకష్ణ, గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ కొమ్మా కోట్లు, గన్నవరం మార్కెట్ యార్డ్ ఛైర్మన్ రామిశెట్టి అంజనీ కుమారి, ఎంపీపీ చెన్ను ప్రసన్న కుమారి, జడ్పీటీసీ కాకర్లమూడి సువర్ణరాజు, సర్పంచ్ రాచమళ్ల పూర్ణ చంద్రరావు, రామవరప్పాడు, నిడమానూరు సర్పంచులు వరి శ్రీదేవి, శీలం రంగారావు తదితరులు పాల్గొన్నారు.

కాల్వలకు మరమ్మతులు చేయాలని వినతి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్నందున నియోజకవర్గ పరిధిలోని అన్ని పంట కాలువలకు మరమ్మత్తులు చేయించాలని తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో తాసిల్దార్ ఎల్ వి ఎస్ రామకష్ణకు టిడిపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ ఇరిగేషన్ శాఖ వైసీపీ నాయకుల జేబులు నింపడానికి పనిచేస్తున్నట్లు ఉందని విమర్శించారు. గత ఏడాది కాలువలు వదిలాక వైసిపి నాయకులు పనులు చేపట్టి తూతూ మంత్రంగా చేసి వదిలేసారు అన్నారు. మూడు మండలాలకు సాగు త్రాగునీరు అందించే పులిగడ్డ అక్రిడెక్టుకు నాలుగేళ్ల నుంచి చిన్న మరమ్మత్తులు కూడా చేయలేదన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న ఇప్పటివరకు సాగునీరు విడుదల చేయలేదని వేసవిలో ప్రకటించిన ఏ పని సక్రమంగా జరగలేదన్నారు. అందువల్ల తక్షణమే కాలువలు మరమ్మత్తులు నిర్వహించి నీటిని విడుదల చేయాలని టిడిపి నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు. మండల పార్టీ అధ్యక్షులు యా సం శ్రీనివాసరావు. ఎలవర్తి చిన్న .లుక్కా పిచ్చయ్య. రేపల్లె వెంకట కష్ణారావు. గంటసాల రాజమోహన్రావు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న టిడిపి నాయకులు



ఉయ్యూరు రోటరీ క్లబ్‌కు అవార్డులు

ప్రజాశక్తి- ఉయ్యూరు : ఉయ్యూరు రోటరీక్లబ్కు పలు అవార్డులు లభించాయి. రోటరీ జిల్లా 3020 పరిధిలో గల 80 క్లబ్లలో ఉత్తమ సేవాకార్యక్రమాలు చేసినందుకు వివిధ అంశాలలో 10 అవార్డులు దక్కాయి. విజయనగరంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులు అవార్డులు అందుకున్నారు. ఉత్తమ ప్రెసిడెంట్ టి.వెంకటేశ్వరరావుకు ఉత్తమ క్లబ్ అవార్డు, సెక్రటరీ నాగసుబ్రమణ్యం, పాస్ట్ గవర్నర్, సంపత్కుమార్ ఇతర అంశాలలో అవార్డులు అందుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యాలయ ఆవరణలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కేసీసీ చక్కెర కర్మాగార యూనిట్ హెడ్ పై సీతారామ దాస్, జీఎంలు పున్నారావు, వసంతరావు, ప్రసాదొడ్డి, సయ్యద్ అనీస్ తదితరులు అభినందించారు.



వైవిబిని పరామర్శిస్తున్న కొనకళ్ల జనార్ధనరావు

వైవిబికి టిడిపి నేతల పరామర్శ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఇటీవల అనారోగ్యానికి గురై చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మాజీ ఎమ్మెల్సీ , టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ను పలువురు టీడీపీ నాయకులు సోమవారం పరామర్శించారు. గన్నవరం మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు, బీసీ నాయకుడు కొనకళ్ల జనార్ధనరావు, పంచాయతీరాజ్ చాంబర్ నాయకుడు అరవింద నాథ్‌రెడ్డి, బత్తిన దాసు తదితరులు వైవీబీని పరామర్శించి ఆరోగ్యం గురించి అడిగి తెలుసు కున్నారు. ఉయ్యూరు మాజీ ఛైర్మన్ జంపాన పూర్ణచంద్రరావు, మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి సయ్యద్ అజ్మతుల్లా, ఆకునూరు సర్పంచ్ వసంతరావు, రాజులపాటి ఫణి, కాగిత కొండ, జంపాన శ్రీనివాసరావు, వల్లూరుకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు డిఎస్‌పి కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలోని చెడు నడత కలిగి హిస్టరీ షీట్స్ కలిగి ఉన్న(రౌడీ షీట్స్ సస్పెక్ట్ షీట్స్ కేడి డిసి షీట్స్) హోల్డర్స్ని అవనిగడ్డ పోలీస్ స్టేషన్కు పిలిపించి డిఎస్పి పి మురళీధర్ కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ పోలీస్ స్టేషన్లో షీట్స్ ఉన్న ప్రతి ఒక్కరు ఎలాంటి వివాదాలకు పోకుండా సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడకుండా ఉండాలని, మీపై నిరంతరం పోలీస్ వారి నిగా ఉంటుందని, పనులపై బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పోలీస్ స్టేషన్లో తెలియపరచాలని చెప్పారు. సత్ప్రవర్తనతో ఉండి అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తరువాత పోలీస్ స్టేషన్లో ఎటువంటి కేసులు లేకపోయినా విచారించి చట్టపరంగా షీట్స్ క్లోజ్ చేయటం జరుగుతుందన్నారు. ఎవరు చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ జి శ్రీనివాస్, ఎస్సై రమేష్ బాబు సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలు సకాలంలో పరిష్కరించాలి

- కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : స్పందన అర్జీలపై ప్రత్యేక దష్టి సారించి సకాలంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి రాజాబాబు జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో జిల్లా కలెక్టర్ సంయుక్త కలెక్టర్ డాక్టర్ అపరాజిత సింగ్, డిఆర్ఓ ఎం వెంకటేశ్వర్లు, కేఆర్ఆర్సి ఎస్ డి సి శివనారాయణ రెడ్డి ఆర్డిఓ ఐ కిషోర్ లతో కలిసి స్పందన కార్యక్రమం నిర్వహించి పలు ప్రాంతాల ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ పలు ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చుకొని జిల్లా కేంద్రానికి తమ అర్జీల పరిష్కారం కోసం స్పందన కార్యక్రమానికి వస్తుంటారన్నారు. వారి అర్జీల పట్ల సానుకూలంగా స్పందించి సకాలంలో పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి పీఎస్ఆర్ ప్రసాద్, డ్వామా పిడి జివి సూర్యనారాయణ, జెడ్పీ సీఈవో జ్యోతిబసు, డీఎస్ఓ పార్వతి, ముడా విసి రాజ్యలక్ష్మి, సిపిఓ వై శ్రీలత, డిఎంహెచ్వో డాక్టర్ గీతా బాయి, డిఈఓ తేహెరా సుల్తానా, బీసీ సంక్షేమ అధికారి లక్ష్మీ దుర్గ, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ చంద్ర లీల, సర్వే రికార్డుల ఏడి గోపాలకష్ణ ,ఆర్డబ్ల్యూఎస్ ఎస్.ఈ. సత్యనారాయణ రాజు, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం



ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని పులిగడ్డ వద్ద కష్ణా నదిలో ఆదివారం సాయంత్రం గల్లంతైన ఆముదాల ప్రకాష్ మతదేహం సోమవారం ఉదయం లభ్యమైనట్లు ఎస్సై జి రమేష్ బాబు తెలిపారు. విజయవాడకు చెందిన ఆముదాల ప్రకాష్(32) గల్లంతైన సంఘటన ఆదివారం రాత్రి జరిగింది. ప్రకాష్ అతని మిత్రుడు మధుసూదన్ వెల్డింగ్ పనులు చేస్తుంటారు. కొత్తగా ఏర్పాటు చేసిన టోల్ ప్లాజా వద్ద వెల్డింగ్ పని కుదుర్చుకునేందుకు వచ్చారు. వారితో మాట్లాడిన అనంతరం ఇంటికి తిరిగి వెళుతుండగా వార్పు డొంక రోడ్డు వద్దకు రాగానే బైక్ పైన ఉన్న ప్రకాష్ అదుపుతప్పి పడిపోవడంతో బట్టలకు బురదఅంటుకోవడంతో దానిని శుభ్రం చేసుకునేందుకు పులిగడ్డ కొత్త బ్రిడ్జి సమీపంలో గతంలో కష్ణ నదిలో ఓఎన్జిసి వేసిన రహదారిపై తూముల వద్ద ప్రకాష్ నదిలోకి దిగగా నీట మునిగిపోయాడు. ఇది గమనించిన మిత్రుడు మధుసూదన్ భయంతో సమీపంలోని రహదారిపైకి వచ్చి కొంతమందికి విషయం తెలిపాడు వారు అక్కడకు చేరుకొని వెతికిన ఫలితం లేకుండా పోయింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ రమేష్ అగ్నిమాపక సిబ్బంది గజ ఈతగాళ్ల సహాయంతో లైట్లు వేసుకొని వెతికించిన ఆచూకీ లభించలేదు. చివరకు సోమవారం ఉదయం అదే ప్రాంతంలో ప్రకాష్ మతదేహం లభ్యమైనట్లు తెలిపారు. ఈ మేరకు మతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించినట్లు చెప్పారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు



జగనన్న సురక్షపై అవగాహన

ప్రజాశక్తి-గుడివాడ : గుడివాడ రూరల్ మండలం వలివర్తిపాడు గ్రామంలో ఎంపీపీ శ్రీమతి గద్దె పుష్పరాణి అధ్యక్షతన వాలంటీర్స్, ప్రజలకు జగనన్న సురక్ష కార్యక్రమం పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ పథకంలో అర్హులై ఉండి ఏ కారణంతోనైనా ఇంకా ఎవరైనా మిగిలిపోతే వారికి కూడా సంక్షేమ పథకాలు అందేలాగా వాలంటీర్స్ ఇంటింటినీ జల్లెడ పట్టాలన్నారు. తద్వారా వారికి లబ్ధి చేకూర్చడంతో పాటు వారికింకేమైనా సర్టిఫికెట్లు (జనన, మరణ, కుల, సీసీఆర్సీ, రేషన్ కార్డు డివిజున్, హౌస్ హోల్డ్ డివిజన్, ఇన్‌కమ్ మొదలైన 11 రకాలు ధ్రువీకరణపత్రాలు) సర్వీస్ ఫీజు లేకుండా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుమారి వెంకటరమణ, వైసీపీ కారే జోసెఫ్, ఈఓపిఆర్డి డి.వెంకటేశ్వరరావు, నాయకులు నాగబాబు, రవి, సచివాలయ సిబ్బంది, వాలంటీర్స్, గహ సారథులు పాల్గొన్నారు.

నేడు దేవాలయ భూముల కౌలు వేలం

ప్రజాశక్తి-కోడూరు : హంసలసదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి దేవాలయ భూములకు సంబంధించి ఈ నెల 27న కౌలు వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ సీహెచ్ సుధాకరరావు తెలిపారు. హంసలదీవి గ్రామంలోని 29.57 ఎకరాల చెరువులతో పాటు 7.04 ఎకరాల మెట్ట భూమికి సంబం ధించి కౌలు వేలం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద జరుగుతాయని చెప్పారు. మూడేళ్ల కాల పరిమితితో భూములను కౌలుకు ఇస్తామని వివరించారు. ఆసక్తిగల రైతులు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

కార్పొరేట్ పాఠశాలల దోపిడీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కంచికచర్ల: కార్పొరేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలని జనసేన నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ నాయకులు స్థానిక తహశీల్దార్ పి.శంకరరావుకు వినతిపత్రం అందజేశారు. అధిక ఫీజులు వసూలు చేయటంతో పాటు, అధిక ధరలకు పుస్తకాలు, యూనిఫాం విక్రయిస్తూ పేదలను దోచుకుంటున్నారని, నిబంధనలు పాటించని పాఠశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సతీష్, తోట ఓంకార్, పెద్దినీడి హరి, పుప్పాల వేణు, దేవిరెడ్డి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి-తిరువూరు: ప్రతి కౌలు రైతు రెవెన్యూ శాఖ జారీ చేసే కౌలు గుర్తింపు కార్డు పొందాలని మండల వ్యవసాయ అధికారిణి పి.పద్మ కోరారు. తిరువూరు రాజుపేట మూడో నెంబరు సచివాలయంలో ఖరీఫ్, రబీ పంట కాలానికి కౌలు రైతు గుర్తింపు కార్డులపై అవగాహనా సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గుర్తింపు కార్డు తీసుకుంటేనే ఈ సంవత్సరం కౌలుదారులకు పంట నమోదు చేయడానికి వీలుంటుందన్నారు. రైతు అంగీకార పత్రంతో గుర్తింపు కార్డుకి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. రైతులు తమ గ్రామ పరిధిలోని సంబంధిత విఆర్ఓని సంప్రదించి కార్డును పొందాలని విజ్ఞప్తి చేశారు.



రూ.3 లక్షలతో డ్రైనేజీ పనులు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని 30వ వార్డ్ నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పక్కన 3 లక్షల రూపాయలతో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజ్ పనులను సోమవారం ఎమ్మెల్యే సామినేని ఉదయభాను పరిశీలించారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ పట్టణ అభివృద్ధిలో భాగంగా అన్ని వార్డులలో డ్రైనేజీ మరియు సీసీ రోడ్లు నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. పట్టణ సుందరీకరణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించి ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. నిర్మాణ విషయంలో కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 30వ వార్డు కౌన్సిలర్ పందుల రోశయ్య, ఎన్టీఆర్ జిల్లా ప్రచార కమిటీ ఉపాధ్యక్షులు మోరే వినోద్, వత్సవాయి వైస్ ఎంపీపీ కొలికపోగు వెంకటేశ్వర్లు, చిల్లకల్లు నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

కౌలురైతు గుర్తింపు కార్డులు పంపిణీ

ప్రజాశక్తి-పెనుగంచిప్రోలు: స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో నందు సోమవారం కౌలు రైతుల హక్కు పత్రాలను తహసీల్దార్ లక్ష్మీకళ్యాణి, ఎంపీడీవో ప్రసాదరావు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేల్పుల పద్మకుమారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ నెల 30వ తేదీలోపు మండలంలోని అన్ని గ్రామాల్లో కౌలు కార్డుల కోసం కౌలు రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి బి.రామసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



దుస్తులు అందజేత

ప్రజాశక్తి-నందిగామ: బక్రీద్ పండుగ సందర్భంగా వివిధ మసీదులలో గురువులకు దుస్తులను టిడిపి మైనార్టీ సెల్ నాయకులు పంపిణీ చేశారు. మసీదులో నిర్వహించే ముత్తవల్లిలను శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి విజయవాడ పార్లమెంట్ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ కరీముల్లా, రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ కరిముల్లా, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ గౌస్, నియోజకవర్గ మైనార్టీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షేక్ షాబ్ జాన్ తదితరులు పాల్గొన్నారు.



మైలవరంలో...



నందిగామలో...



జగ్గయ్యపేటలో...

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండండి

ప్రజాశక్తి-మైలవరం: డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఎసిపి ఎం.రమేష్ అన్నారు. మదకద్రవ్యాల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పోలీస్, ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో డ్రగ్స్ నిర్మూలనపై మైలవరంలోని ప్రధాన రహదారుల్లో సోమవారం విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు అలవాటు పడి వారి విలువైన జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐలు మోహన్‌రెడ్డి, గిరిజ, ఎస్ఐ హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ: నవజీవన్ బాల భవన్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో పోలీస్, సిద్ధార్థ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ డిపార్ట్మెంట్ సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం విజయవాడ శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో మాదక ద్రవ్యాలపై అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు అలవాటు పడి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వినియోగం ప్రాణాంతకమని అన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ కె.రామకృష్ణప్రసాద్, సిద్ధార్థ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ డేగా ప్రభాకర్, నవజీవన్ బాల భవన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నీలం రత్నకుమార్, మేనేజర్ గోళ్లమూడి శేఖర్‌బాబు, శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాల ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ కె సరళ, టి నాగరాణి, నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్స్ జె ఆంజనేయులు, బి రమేష్, య డి వసంత కుమారి తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-జగ్గయ్యపేట:** పట్టణంలోని యువతని నిర్వీర్యం చేసే మాదక ద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై సోమవారం విద్యార్థులకు అవగాహన కల్పించెందుకు పోలీస్ మరియు స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ డిపార్ట్మెంట్ ల సంయుక్త ఆధ్వర్యంలో యాంటీ డ్రగ్స్ ర్యాలీని జెఆర్‌సి కళాశాల వద్ద నుండి ఎన్టీఆర్ చౌరస్తా మీదుగా డిపో సెంటర్ వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ జానకి రామ్, ఎస్ఐ రామారావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-నందిగామ:** నందిగామ పట్టణంలోని వైసిపి కార్యాలయంలో అంతర్జాతీయ మత్తు పదార్థాల దుర్వినియోగ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా డాన్‌బాస్కో నవజీవన్ బాల భవన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్‌రావు సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ మేరుగు రత్నం పాల్గొన్నారు. మత్తు పదార్థాలకు యువత వ్యతిరేకంగా ఉండాలని నందిగామ అడిషనల్ జడ్జి రియాజ్ పేర్కొన్నారు. పట్టణంలోని అక్షర కాలేజీలో నందిగామ మండల లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడుతూ విద్యార్థిని విద్యార్థులకు చట్టాలు పట్ల అవగాహన ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ బొబ్బిళ్లపాటి భాస్కరరావు, కాట్రా సత్యనారాయణ, మాజీ ఏజీపీ రామకృష్ణ పాల్గొన్నారు. **ప్రజాశక్తి-విజయవాడ:** అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా పరిధిలో సోమవారం అవగాహన ర్యాలీలు, సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా పోలీసు కమిషనర్ (సిపి) కాంతిరాణాటాటా మాట్లాడుతూ... యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు. విద్యార్థుల తల్లితండ్రులు అందరూ కలిసి ఈ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. డ్రగ్స్ సరఫరా చేసే వారి ఆటకట్టించడానికి ఎల్లవేళల సిద్ధంగా ఉన్నామని డ్రగ్ మాఫియాను అరికట్టడానికి ప్రజలు, విద్యార్థులు కలిసి పోలీస్ వారికి సహకరించాలని తెలిపారు. డ్రగ్స్ సంబంధించి ఎటువంటి సమాచారం ఉన్న దగ్గరలో వున్న పోలీస్ వారి దష్టికి లేదా టోల్ ఫ్రీ నెంబర్ 14500కు తెలియజేయాలన్నారు.



సిద్ధార్థ మహిళా కళాశాలలో



రామలింగేశ్వరనగర్‌లో...

మాదక ద్రవ్యాల వినియోగం తో భవిష్యత్ అంధకారంగా మారుతుందని విజయవాడ డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ అన్నారు.నవజీవన్ బాల భవన్ అధ్వర్యంలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వినియోగం వ్యతిరేక వారోత్స ల్లో భాగంగా రామలింగేశ్వర నగర్ పడవల రేవు సెంటర్ లో సోమవారం అవగాహన ర్యాలీ, పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ మత్తుపదార్థాలకు లోనై యువత దెబ్బతింటుందని అన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని కోరారు. మత్తు పదార్థాలు తీసుకొని జీవితాన్ని నరకప్రాయం చేసుకోవద్దని, దుర అలవాట్లకు బానిసలు కావద్దని అన్నారు. వాటికి ప్రజలు దూరంగా ఉండాలని కోరారు. మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం కషి చేస్తానని విద్యార్థుల చే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ పి. రాఘవ కిరణ్, సిహెచ్ సుకన్య , మహిళా పోలీస్ సిబ్బంది, నాగలక్ష్మి, వాసంతి ,ప్రగతి, పద్మజ సీత పాల్గొన్నారు.

30న మహాధర్నాను జయప్రదం చేయండి

రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆంజనేయులు



ప్రజాశక్తి-మైలవరం

రైతాంగ సమస్యల పరిష్కారానికి ఈనెల 30వ తేదీన విజయవాడలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పగడాల ఆంజనేయులు కోరారు. స్థానిక రైతు సంఘం కార్యాలయం వద్ద సోమవారం మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత ఏడాది నవంబర్, డిసెంబర్‌లలో కురిసిన అకాల వర్షాలకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయనీ, దీంతో రైతాంగానికి తీవ్రంగా నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్టపోయిన రైతులందరికీ ఇన్పుట్ సబ్సిడీ, పంట భీమా వెంటనే విడుదల చేయాలని, ఇన్పుట్ సబ్సిడీ ఆహార పంటలకు ఎకరాకు రూ.10 వేలు, వాణిజ్య పంటలకు ఎకరాకు రూ.25 వేల వరకు పెంచాలన్నారు. నకిలీ విత్తనాలు చలామణిలోకి రాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, విత్తన చట్టం తీసుకురావాలని కోరారు. దశాబ్దాలకు పైగా అటవీ భూముల్లో మామిడి తదితర పంటలను సాగు చేసుకుంటున్నా రైతులకు చెట్టు పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు రావుల సుబ్బారావు, వజ్రాల వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి సందీపాము ఇస్సాకు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పత్తిపాటి నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు గండేబత్తుల పోతురాజు, టి. శేషయ్య, పి.రమణ, మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు షటిల్ బ్యాట్ల పంపిణీ

ప్రజాశక్తి-సింగ్‌నగర్

పిల్లలు చదువుతో పాటు ఆటల్లో కూడా రాణించాలని పౌర సంక్షేమ సంఘం సహకారంతో అజిత్ సింగ్‌నగర్ పరిధిలోని 60వ డివిజన్లో ఈ బ్లాక్ వద్ద గల చిన్న పిల్లలకు దాదాపు 20 మందికి షటిల్ బ్యాట్స్‌ను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ వాసు, పాస్టర్ కామల్ల శ్యామ్, సుజన క్లినిక్ డాక్టర్ గంగవరపు జగన్, డివైఎఫ్ఐ కార్యదర్శి పి రవి, అధ్యక్షుడు జి సాయి, కమిటీ సభ్యులు షేక్ పీరు సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.



మత్తుపదార్థాలతో భవిష్యత్తు నాశనం

• డ్రగ్స్ అనర్థాలపై పలుచోట్ల అవగాహనా ర్యాలీలు

ప్రజాశక్తి-పెడన : ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పెడన పోలీస్ సర్కిల్ కార్యాలయ సిబ్బంది, స్థానిక సహాయ ఫౌండేషన్ సంయుక్తంగా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మంత్రి జోగి రమేష్ పాల్గొని డ్రగ్స్ వినియోగానికి స్వస్తి చెబుదాం... డ్రగ్స్ వినియోగానికి దూరంగా ఉందాము అంటూ బ్యానర్ చేతబట్టిన కాలేజీ విద్యార్థులతో మంత్రి ఈ ర్యాలీలో నడిచారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ మత్తు పదార్థాలు విద్యార్థుల జీవితాన్ని చిత్తు చేస్తాయి కాబట్టి వాటిని విడిచి సన్మార్గంలో నడిచి తల్లిదండ్రులు గర్వించేలాగా మంచి స్థాయిలో స్థిరపడాలని మంత్రి కోరారు. ఈ ర్యాలీలో మచిలీపట్నం ఆర్డిఓ కిషోర్, ఎమ్మార్వో మధుసూదన్ రావు, సీఐ వీరయ్య గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : ఉయ్యూరు టౌన్ పరిధిలో ఉయ్యూరు టౌన్ ఎస్ఐ. వీరప్రసాద్ ఆధ్వర్యంలో డ్రగ్స్‌రహిత సమాజ స్థాపనకు ఉద్యమిద్దామని ఏజీ అండ్ సిద్ధార్థ కాలేజ్ విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. డ్రగ్స్ వద్దు ఆరోగ్యం ముద్దు అని విద్యార్థులు ప్రజలకు తెలిసే విధంగా ర్యాలీలో డ్రగ్స్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, స్థానికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** మత్తు పదార్థాలు వాడకాన్ని నిర్మూలించాలని గుడ్లవల్లేరు ఎస్సై వి ఎసేబు కోరారు. గుడ్లవల్లేరు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించాలని కోరుతూ ప్రధాన రహదారిలో భారీ ర్యాలీ, మానవహారం నిర్వహించారు. గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ అధ్యాపకులు కొడాలి శరత్ బాబు, ఉమెన్ పోలీసులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మొవ్వ :** యువత మత్తుపదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును నాసనం చేసుకోవద్దని కూచిపూడి ఎస్.ఐ. సందీప్ అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాలు మాదకద్రవ్యాల వ్యతిరేఖ దినోత్సవం సందర్భంగా సోమవారం విద్యార్థులతో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐబి మొవ్వ ఎస్ఐ పి.హేమ సుష్మిత, మొవ్వ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి పెదపారుపూడి :** మత్తు పదార్థాలకు యువకులు, విద్యార్థులు, గ్రామీణ ప్రాంత ప్రజలు దూరంగా ఉండాలని పెదపారుపూడి స్టేషన్ ఎస్ఐ పి. నాగ కళ్యాణి అన్నారు. మండల కేంద్రమైన పెదపారుపూడి గ్రామ వీధులలో ఈ విషయమై సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మచిలీపట్నం అర్బన్ :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (ఐఆర్ సిఎస్) కష్ణా జిల్లా శాఖ, కేంద్ర యువజన వ్యవహారాలు మరియు క్రీడా మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్రం, విజయవాడ సంయుక్త ఆధ్వర్యంలో నందమూరులోని శ్రీ వాసవి ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ తోట ఎస్.ఎస్. బాలాజీ మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాలను సాధించాలంటే యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఒకసారి అలవాటు పడితే శారీరక, మానసిక, సామాజిక, ఆర్థిక, న్యాయ సంబంధమైన సమస్యలు ఎదుర్కోవలసి వస్తుందని తెలిపారు. నెహ్రూ యువకేంద్రం డిస్టిక్ యూత్ ఆఫీసర్ సుంకర రాము, జిల్లా రెడ్ క్రాస్ సెక్రెటరీ భవిరి శంకర్ నాథ్, ఎన్వైకే ప్రోగ్రాం కోఆర్డినేటింగ్ భీమాల వినోద్ కుమార్, వాసవి కళాశాల ప్రిన్సిపాల్ బిఆర్ఎస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అనిల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** యువత గంజాయి బారిన పడవద్దని అవనిగడ్డ డీ.ఎస్.పీ మురళీధర్ సూచించారు. స్థానిక విజయ క్రాంతి జూనియర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ బీ.భీమేశ్వర రవికుమార్ ఆధ్వర్యంలో చల్లపల్లిలోని పురవీధుల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. చల్లపల్లి, ఘంటసాల, మోపిదేవి ఎస్ఐలు సీహెచ్ చినబాబు, కుడిపూడి శ్రీనివాసు, సీహెచ్.పద్మ, విజయ క్రాంతి కళాశాల కరస్పాండెంట్ దుట్టా శివప్రసాద్, పోలీసులు, విద్యార్థులు కలిసి విజయ క్రాంతి జూనియర్ కళాశాల వద్ద నుంచి ప్రధాన కూడలి వరకూ అవగాహన ర్యాలీ, మానవ హారం నిర్వహించారు. **ప్రజాశక్తి ఘంటసాల :** మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఘంటసాల ఎస్ఐ కె.శ్రీనివాస్ సూచించారు. సోమవారం అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఘంటసాలలోని వర్ల ఐటిఐ కళాశాలలో విద్యార్థులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గంజాయి, కొకైన్, హెరాయిన్ వంటి మాదక పదార్థాలకు యువత లోను కావొద్దని ఎస్ఐ సూచించారు. ఐటిఐ కళాశాల ప్రిన్సిపాల్ రవికుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, హెడ్ కానిస్టేబుల్ పద్మారావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** గన్నవరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి డాక్టర్ సి. హెచ్. శ్రీనివాసబాబు, స్పెషల్ కోర్ట్ మెజిస్ట్రేట్ ఆర్. రామచంద్రరావు, డియస్. పి జయ సూర్య, మండలలీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. బార్ అసోసియేషన్ అధ్యక్షులు తిరివీధి వెంకయ్య, కార్య దర్శి జాస్తి తాతారావు సీనియర్ న్యాయవాదులు అనుమోలు వెంకటేశ్వరావు, సాంబశివరావు, భాస్కర్‌ల పర్యవేక్షణలో గన్నవరం ప్రధాన వీధులలో విద్యార్థులచే ర్యాలీ నిర్వహించారు. గన్నవరం సి. ఐ కనకరావు, యస్ ఐ లు శ్రీనివాసరావు, నాగరాజు, ఆత్కూర్ యస్. ఐ శ్రీనివాసరావు, గన్నవరం బాలుర ఉన్నత పాఠశాల వ్యాయమ విద్య ఉపాధ్యాయులు ధనియాల నాగరాజు, గుడ్ మార్నింగ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ చిప్పాడ చంద్ర శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పెడనలో...



మచిలీపట్నంలో...



చల్లపల్లిలో...



మొవ్వలో...

బోళ్లపాడు శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి ఉయ్యూరు : బోళ్ళపాడు దళితులకు స్మశాన వాటిక స్థలం కేటాయించాలని సిపిఎం పార్టీ పట్టణ కార్యదర్శి బి రాజేష్ అన్నారు. స్మశాన వాటిక స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం తాహసిల్దార్ మస్తాన్ కి అర్జీ సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుంచి బాధపడుతుస్మశాన వాటిక స్థలం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వం స్థలం కేటాయించకపోవడంతో ముదునూరు ఉయ్యూరు ఆర్ అండ్ బి రహదారి పక్కన రెండు సెంట్లు స్మశాన వాటిక గ్రామస్తులు ఉపయోగించుకుంటున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిసార్లు ఉన్నతాధికారులు దష్టికి తీసుకు వెళ్లినా ఈ సమస్యను పట్టించుకోవడం లేదని వారు తెలిపారు. ప్రభుత్వాలు ఇప్పటికైనా స్పందించి వెంటనే స్మశాన వాటిక స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలోసిపిఎం నాయకులు ఏ తిరుపతిరావు, అన్ని సుబ్బారావు, పూర్ణచంద్రరావు, స్మశాన వాటిక పోరాట సంఘం నాయకులు సురేష్, ఉక్కు రాజేష్, విజయ కుమారి, ఇతరులు పాల్గొన్నారు.



కౌలుదారు హక్కు పత్రం అందించాలి

భూయజమాని సంతకంతో పనిలేకుండా

• కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు

ప్రజాశక్తి-ఉయ్యూరు : భూ యజమాని సంతకంతో పని లేకుండా వాలంటీర్లు కౌలు దారు హక్కు పత్రం కౌలు రైతుల సంతకం ద్వారానే అమలు చేయాలని రాష్ట్ర కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం హరిబాబు అన్నారు. ఉయ్యూరు లోని శ్రామిక భవనంలో ఏర్పాటుచేసిన కౌలు రైతు సంఘం జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష పథకంలో 11 అంశాలకు సంబంధించి సర్టిఫికెట్లు వాలంటీర్ల ద్వారా అంద చేస్తున్నారని అందులో భాగంగానే కౌలు రైతులను భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా కౌలు రైతులకు మేలు చేసే విధంగా నిర్మాణాత్మకమైన పాత్ర వాలంటీర్లు రెవెన్యూ సిబ్బంది పోషించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పసుపు మద్దతు ధరను సరైన నిర్దిష్ట సమయంలో ప్రభుత్వం ప్రకటించకపోవడం వల్ల అనేకమంది రైతులు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడిందని, ప్రభుత్వం అనాలోచిత నిర్ణయాల వల్ల పసుపు రైతులు నష్టపోయారని ఆయన ఆరోపించారు. ఈ మధ్యకాలంలో పసుపు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుచేసి మద్దతు ధర 6800 ప్రకటించటం వల్ల దళారులను బాగు చేయడమేనని హరిబాబు విమర్శించారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షులు నాగేంద్రం జిల్లా సహాయ కార్యదర్శి సేలం నాగేశ్వరరావు ఉపాధ్యక్షులు విమరియదాసు జిల్లా నాయకులు జి రమేష్ తోట్లవల్లూరు పమిడిముక్కల మండల కార్యదర్శులు ఎస్ లక్ష్మణరావు గుడిసె బుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎం.హరిబాబు

కాగిత కృష్ణ ప్రసాద్ పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : పెడన టిడిపి ఇన్చార్జ్ కాగిత కృష్ణ ప్రసాద్ పుట్టినరోజు వేడుకలను అవనిగడ్డ గాంధీ క్షేత్రంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు కేక్ కట్ చేసి కష్ణ ప్రసాద్ కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, యాసం చిట్టిబాబు, లుక్కా వెంకట పిచ్చయ్య, ఘంటసాల రాజమోహన్రావు, మండలి రామ్మోహన్రావు ఉప్పల ప్రసాద్ కూనప రెడ్డి చంద్రశేఖర్ ఎలవర్తి చిన్న గుగ్గిలం శ్యాం కుమార్ రేపల్లె కష్ణారావు, వాసు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) : కృష్ణాజిల్లా వ్యాప్తంగా విద్యా రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలక్టర్ పి.రాజా బాబుకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్ సమరం మాట్లాడుతూ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటికీ పాఠ్యపుస్తకాలు పూర్తి స్థాయిలో ఇవ్వలేదని, దీనివల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా రన్నారు. అలాగే వాళ్ళకి కనీస మౌలిక వసతులు లేక పోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే పూర్తి స్థాయిలో అధ్యాపకులను నియమించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అద్దె భవనాల్లో నిర్వహించ బడే కళాశాలలకు,వసతి గహాలకు సొంత భవనాలు కేటాయించి విద్యా బోధనలను జరపాలని డిమాండ్ చేశారు. నాడు నేడు పనులను త్వరగా పూర్తిచేసి తరగతి గదులు ప్రారంభించేల చర్యలు తీసుకోవాలన్నారు.అలానే నూతన జాతీయ విద్యా విధానం రద్దు చేసి కామన్ విద్యా విధానాన్ని అమలు చేయాలని, నాలుగు సంవత్సరాల డిగ్రీని రద్దుచేసి మూడు సంవత్సరాల డిగ్రీనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యక్షుడు వి.కీర్తి మాట్లాడుతూ పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ విద్యార్థులకు మెస్ కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, హాస్టల్ విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు.బాలికల వసతి గహాల వద్ద రాత్రి గస్తీ పెంచాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు సమీర్ ,దత్తు, లు ఉన్నారు.



వినతిపత్రం అందిస్తున్న శ్రామిక మహిళ కన్వీనర్ పి. ధనశ్రీ

మహిళల పని ప్రదేశాల్లో ఫిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : పని ప్రదేశాలలో మహిళలు లైంగిక వేధింపుల అరికట్టడానికి పిర్యాదు కమిటీలు ఏర్పాటు చేయాలని కోరుతూ శ్రామిక మహిళా జిల్లా కమిటి (సి ఐ టి యు) అనుబందం ఆధ్వర్యంలో సోమవారం జిల్లా జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ కు వినతి పత్రం అందజేశారు.అనంతరం శ్రామిక మహిళ కన్వీనర్ పి. ధనశ్రి మాట్లాడుతూ సంఘటిత, అసంఘటిత రంగాలలో పనిచేస్తున్న మహిళల సంఖ్య గణనీయంగా ఉందని అలాగే పని ప్రదేశాలలో మహిళలు లైంగిక వేధింపుల బారిన పడి తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. శ్రామిక మహిళలపట్ల వివక్షత అనేక రూపాలలో కొనసాగుతుందన్నారు .సమాన పనికి సమాన వేతన చట్టం ఉన్న అనేక సెక్టార్లలో అమలు జరగడం లేదన్నారు ప్రభుత్వ, ప్రైవేటుశాఖలలో, సంస్థలలో టాయిలెట్స్, మంచినీరు, విశ్రాంతి గదులు, క్రిచ్, భద్రతా సౌకర్యాలు లేక శ్రామిక మహిళలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నరన్నారు. నేరవిభాగము లెక్కల ప్రకారము విద్యార్థులు, మహిళలపై ప్రతి ఏటా దాడులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో వివిధ పబ్లిక్, ప్రైవేటు సెక్టార్లో శ్రామిక మహిళల పనిప్రదేశాలలో అన్ని స్థాయిల్లో కంప్లైంటు కమిటీలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీటిని అరి కట్టడానికి పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నిరోధక కమిటీలు (కంప్లైంటు కమిటీలు) వేసి . నోటీస్ బోర్డులో పెట్టాలన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా నాయకురాలు ఎ.రమాదేవి,మరియు ఇందిరా లు ఉన్నారు.

నేడు ఇపిఎఫ్‌పై అవగాహన కార్యక్రమం

ప్రజాశక్తి - విజయవాడ

విజయవాడలోని ఉద్యోగుల భవిష్య నిధి (ఇపిఎఫ్) ఆధ్వర్యాన ఈనెల 27వ తేదీన పిఎఫ్ పరిధిలోకి వచ్చే యజమానులు, ఉద్యోగులు, పెన్షనర్లు, ఇతర వాటాదారులు, లబ్ధిదారులతో నిధి ఆప్ కే నికత్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ప్రాంతీయ పిఎఫ్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇపిఎఫ్ చట్టం ద్వారా అందే పథకాలు, సేవలపై వాటాదారులకు అవగాహన కల్పించేందుకు కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాల్లో మంగళవారం ఉదయం 9 నుండి సాయంత్రం 4 గంటల వరకు రెండు దశలుగా సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. యజమానులంతా విధిగా హాజరై ఫిర్యాదులు, సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు.

మొదటి పేజీ తరువాయి

అద్దెలతో పోటీగా కరెంటు బిల్లులు

పెంపుతో తాము అద్దెతో సమానంగా విద్యుత్ ఛార్జీలు చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఇళ్ల అద్దెదారులు వాపోతున్నారు. కృష్ణాజిల్లాలో 5,57,624 గృహ విద్యుత్ వినియోగదారుల నుంచి ఇప్పటి వరకు వివిధ ఛార్జీల రూపంలో రూ.140 కోట్లకు పైగా విద్యుత్ సంస్థలు వసూలు చేసినట్లు అంచనా.

అద్దెతో పోటీగా విద్యుత్ ఛార్జీలు

మచిలీపట్నం రాజుపేట మగ్గాల కాలనీకి చెందిన ఆటో డ్రైవర్‌గా వి.కిరణ్‌కుమార్ నెలకు రూ.3,300 అద్దె చెల్లిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో రూ.650 విద్యుత్ బిల్లు చెల్లించారు. అయితే ఏప్రిల్, మేలో విద్యుత్ బిల్లు విపరీతంగా పెరిగిపోయింది. మేలో 345 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించారు. దీనికిగాను జూన్లో రూ.2,407 బిల్లు వచ్చింది. దీనిలో విద్యుత్ వినియోగానికి సంబంధించిన ఎనర్జీ ఛార్జీలు 2,110.75 ఉండగా, గతంలో ఇతరులు వినియోగించిన దారికి సంబంధించి, ఇతర భారాలు కలిపి మరో రూ.296.25 చెల్లించాలని బిల్లు పంపారు. ఇదే కాలనీకి చెందిన ఎలక్ట్రీషియన్ పి.వేణు నెలకు రూ.3,500 అద్దె చెల్లిస్తున్నారు. ఫిబ్రవరికి సంబంధించి మార్చిలో రూ.700 విద్యుత్ బిల్లు చెల్లించారు. ఏప్రిల్‌లో రూ.1400, మేలో రూ.1600, జూన్లో రూ.1800 చొప్పున కరెంటు బిల్లులు వచ్చాయి. ఇదే కాలనీలో మసీదు వెనుక అద్దెకు ఉండే అవుట్ సోర్సింగ్ ఉద్యోగి మహ్మద్ హమీద్‌కు మేలో విద్యుత్ వినియోగానికిగాను రూ.2,508, అలాగే కరెంటు కాలనీలో ఉండే నాంచారమ్మకు రూ.3,218 బిల్లులు వచ్చాయి. ఈ బిల్లులు చెల్లించాలంటే అప్పులు చేయాల్సిందేనని బిల్లు బాధితులు వాపోతున్నారు.

యువ న్యాయవాదులకు ఆర్థిక చేయూత

చెందిన వారు ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, శాసన సభ్యులు మల్లాది విష్ణు వర్ధన్, మాజీ మంత్రి, శాసన సభ్యులు వెలంపల్లి శ్రీనివాస్, డిప్యూటీ మేయర్లు బెల్లం దుర్గ, అవుతు శ్రీ శైలజ రెడ్డి, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషగిరి, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, వక్ఫ్ బోర్డు చైర్మన్ గౌస్ మొహింతి, గ్రంధాలయ సంస్థ చైర్మన్ జమల పూర్ణమ్మ, ఫైనాన్స్ కార్పొరేషన్ సభ్యులు విజిత, బెజవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ కె. సుందర్, జాయింట్ సెక్రటరీ నరహర శెట్టి జ్యోతి, మహిళా విభాగపు సెక్రటరీ పి. జయలక్ష్మి, న్యాయవాది పి. జ్యోతి, లబ్ధిదారులైన జూనియర్ లాయర్లు పాల్గొన్నారు. మచిలీపట్నంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ ఈ పథకం కింద ఏడాది మొదటి విడత 6 నెలలకు కష్ణా జిల్లాలో అర్హులైన 43 మంది యువ న్యాయవాదులైన లబ్ధిదారులకు సుమారు రూ.13 లక్షలు వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో జ్యోతి బసు, డిఆర్‌డిఎ పీడీ పిఎస్ఆర్ ప్రసాద్, డిఎల్‌డిఒ సుబ్బారావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివి రమణ, న్యాయవాదులు పి అంకరాజు, చీలి ముసలయ్య కలెక్టరేట్ సూపరెంటెంట్ హరనాథ్, పలువురు యువ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఎసిబి దాడులు

(మొదటి పేజీ తరువాయి)

సిఆర్‌పిసి నోటీసు మాత్రమే ఇచ్చేందుకు, అంతేగాక ప్రింటింగ్ ప్రెస్‌ను సీజ్ చేయకుండా, కంప్యూటర్ ఆపరేటర్ పేరును కేసులో చేర్చకుండా ఉండేందుకు గుడివాడ రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.ఎన్.వి.జయ కుమార్ బెదిరించి రూ.2 లక్షలు లంచంగా డిమాండ్ చేశారు. దీంతో ఇమేజ్ డిజిటల్స్ మేనేజర్ కిరణ్ ఎసిబి అధికారులను ఆశ్రయించాడు. ఈనేపథ్యంలో సోమవారం సిఐ జయకుమార్ బాధితుడి వద్ద నుండి రూ.75 వేలు లంచంగా తీసుకొని హోంగార్డు ఎమ్‌డి.సనవుల్లాకు ఇచ్చారు. ఈసమయంలో ఎసిబి అడిషనల్ ఎస్‌పి స్నేహిత ఆధ్వర్యాన విజయవాడ రేంజ్ అవినీతి నిరోధక శాఖ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిఐపై కేసు నమోదు చేశారు.

ప్రకటన

మహారాజ శ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఓఎస్ 148/2021

బిట్విన్
అత్తునూరు కృష్ణారెడ్డి – వాది
మరియు
తుమ్మలపల్లి శ్రీనివాసరావు సన్నాఫ్ వెంకటేశ్వరరావు, హిందువు, వయసు 40 సంవత్సరాలు, వ్యవసాయం, పిటి. కొత్తూరు, తిరువూరు మండలం ఎన్టీఆర్ జిల్లా ... ప్రతివాది

పై నెంబర్ దావాలో ప్రతివాది అయిన తుమ్మలపల్లి శ్రీనివాసరావుకు శ్రీకోర్టు వారు సమన్లు పంపించి యుండగా ప్రతివాదికి అంది ఉండలేదు. పై దావాలో పైకోర్టులో ప్రతివాది హాజరగుటకు వాయిదా ది.30-06- 2023 అయివున్నది. కావున సదరు రోజున ప్రతివాది వ్యక్తిగతముగా గానీ, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరుకాగలరు. లేనియెడల దావాను పరోక్షముగా తీర్మానించబడును

శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం

తిరువూరు
ది.26-06-2023

వాది అడ్వకేట్,
అత్తునూరు ప్రభాకరరెడ్డి,
బీఎస్సీ, బిఎల్, అడ్వకేట్,
తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా
సెల్. 9440989132

ప్రకటన

మహారాజ శ్రీ తిరువూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఐఏ 261/2021 ఇన్ ఓఎస్ 148/ 2021

బిట్విన్
అత్తునూరు కృష్ణారెడ్డి ..... ప్రిటీషనరు/ వాది
మరియు
తుమ్మలపల్లి శ్రీనివాసరావు సన్నాఫ్ వెంకటేశ్వరరావు, హిందువు, వయసు 40 సంవత్సరాలు, వ్యవసాయం, పిటి. కొత్తూరు, తిరువూరు మండలం ఎన్టీఆర్ జిల్లా .... రెస్పాండెంటు/ప్రతివాది

పై నెంబర్ పిటీషనులో రెస్పాండెంటు/ ప్రతివాది అయిన తుమ్మలపల్లి శ్రీనివాసరావుకు శ్రీకోర్టువారు నోటీసులు పంపించియుండగా రెస్పాండెంటు/ ప్రతివాదికి అందివుండలేదు. పై పిటీషన్‌లో పైకోర్టులో రెస్పాండెంటు/ప్రతివాది హాజరగుటకు వాయిదా ది.30-06- 2023 అయివున్నది. కావున సదరు రోజున రెస్పాండెంటు / ప్రతివాది వ్యక్తిగతముగా గానీ, ప్లీడర్ గారి ద్వారా గాని హాజరుకాగలరు. లేనియెడల పిటీషన్ ను పరోక్షముగా తీర్మానించబడును.

/ శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం /

పిటీషనరు / అడ్వకేట్,
అత్తునూరు ప్రభాకరరెడ్డి,
బీఎస్సీ, బిఎల్, అడ్వకేట్,
తిరువూరు **తిరువూరు, ఎన్టీఆర్ జిల్లా**
ది.26-06-2023 **సెల్. 9440989132**

జర్నలిస్ట్ ఉద్యమ నేత అంబటికి పలువురు నివాళి

ప్రజాశక్తి-విజయవాడ : జర్నలిస్టు ఉద్యమ నేత అంబటి ఆంజనేయులుకు సోమవారం పలువురు నేతలు, జర్నలిస్టులు నివాళులర్పించారు. విజయవాడలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూసిన ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ స్టీరింగ్ కమిటీ సభ్యులు, ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర గౌరవ సలహాదారు అంబటి భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. అంబటి ఆంజనేయులు అంతిమ యాత్రలో పాల్గొన్నారు. ఐజేయు సభ్యులు ఎస్‌కే.బాబు, సిపిఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అర్బన్ యూనిట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చావా రవి, కొండా రాజేశ్వరరావు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నగర అధ్యక్ష కార్యదర్శులు కె.కలిమిశ్రీ, ఎం.బి.నాథన్, సీఆర్ మీడియా అకాడమి కార్యదర్శి తిలక్, ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు వీర్ల శ్రీరామ్ యాదవ్, కార్యదర్శి వై.వి.రమణ తదితరులు అంబటికి నివాళు లర్పించిన వారిలో ఉన్నారు. ఏపిడబ్ల్యుజెఎఫ్ విజయవాడ పశ్చిమ నగర అధ్యక్షులు ఎన్. నరేంద్ర కుమార్, కార్యదర్శి వెంట్రప్రగడ ఉదయ ఫణికుమార్, సహాయ కార్యదర్శి వి. కృష్ణా రెడ్డి, ఉపాధ్యక్షులు ఎ. శ్రీనివాస్, కోశాధికారి కె. శ్రీనివాసరావు సంతాపం తెలిపారు.

భారీగా గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - విజయవాడ : గంజాయి స్మగ్లర్ల గుట్టును విజయవాడ కస్టమ్స్ ప్రివెంటేవ్ కమిషనరేట్ అధికారులు మరోసారి రట్టు చేశారు. సేకరించిన సమాచారం మేరకు విజయవాడ జాతీయ రహదారి ప్రసాదంపాడు వద్ద ఒక మినీ ట్రక్కు, కారును కస్టమ్స్ అధికారులు తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో ఉల్లిపాయల మాటున గంజాయి నింపిన గోతాలు, కారు వెనుక డిక్కీలో గంజాయి ప్యాకింగ్‌లు బయటపడ్డాయి. రెండు వాహనాల్లోని మొత్తం 405.229 కిలోల గంజాయిని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.81 లక్షలు ఉంటుందని కస్టమ్స్ ప్రిన్సిపల్ కమిషనర్ ఆర్.శ్రీరామ్ తెలిపారు. వీటిని రవాణా చేస్తున్న ఆరుగురిని అరెస్టు చేసి వారిపై ఎన్‌డిపిఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. నిందితులను విజయవాడ 4వ అడిషనల్ చీఫ్ మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా, ఆయన రిమాండ్ విధించారు.



IN THE COURT OF THE 2ND ADDL. DISTRICT JUDGE CUM METROPOLITAN SESSIONS JUDGE AT VIJAYAWADA
A.S.No.126/2018

Between:
1. Sri Venkata Ramana Auto Enterprises, Rep. by its Managing Partner
2. Kiralaru Venkateswara Rao

.... Appellants / Defendants

AND

M/s. Nandhini Auto Motives
Rep.by its Manager K.V. Naga Raju, S/o Adinarayana, D.No.76-18-256B, Iron Complex, Bhavanipuram, Vijayawada-12.

Gogineni Madhu Prasad, S/o Ramesh, Chodavaram Village, Penamaluru Mandal, Krishna District. ... Respondants

పై నెంబరు అప్పీలులోని 1,2 రెస్పాండెంట్స్ అయిన మీకు శ్రీ కోర్టువారు ఎన్నిసార్లు నోటీసులు పంపిననూ తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మీ యొక్క హాజరు నిమిత్తం శ్రీ కోర్టువారు ది.28-07-2023నకు వాయిదా వేసియున్నారు. కావున పై తేదీన మీ ఇరువురు ఉదయం గం.10.30 ని.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయముగా గానీ, న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్నయెడల తెలుపుకోవలెను. లేనియెడల పై అప్పీలు మీ పరోక్షమున తీర్మానింపబడును.

వాయిదా తేది: 28-07-2023

/// శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ///

చలమల భాస్కరరావు, అడ్వకేట్,
విజయవాడ-8

రెండవ అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు
విజయవాడ
ఐ.ఎ.114/2022
ఇన్
ఐ.ఎ.175/2021
ఇన్
ఓ.యస్.495/2009

బిట్వీన్:
చట్టు సీతారామయ్య (డైడ్) మరియు ఇతరులు ...పిటీషనర్లు
మరియు
చట్టు గిరజమ్మ మరియు ఇతరులు ...రెస్పాండెంట్లు
టు,
1)చట్టు మురళీకృష్ణ, తండ్రి శివ నాగేశ్వరావు (లేట్)
రెసిడెన్సీ: కొత్తూరు తాడేపల్లి విలేజ్,
విజయవాడ రూరల్ మండలం.
2)చట్టు బిందుశ్రీ, తండ్రి శివ నాగేశ్వరావు (లేట్)
రెసిడెన్సీ: కొత్తూరు తాడేపల్లి విలేజ్,
విజయవాడ రూరల్ మండలం.

పైన పేర్కొనబడిన ఐ.ఎ.114/2022 నందు ప్రతివాదులుగా మీకు అనేక పర్యాయములుగా నోటీసులు పంపించిన మీరు స్వీకరించక పోవడం వలన కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా తెలియ చేయుటకు ఆర్డర్ వేసినారు. మీరు 03-07-2023న ప్రత్యక్షముగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరు కాగాలరు. కానిచో మీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది:03-07-2023

సిహెచ్.యు.యమ్.రెడ్డి,
బిహెచ్.ఫణిశ్రీ,
న్యాయవాదులు, విజయవాడ.

నోటీసు
మహారాజశ్రీ కొత్తగూడెం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P.No. 6/2020

బిట్వీన్:
శీలపురెడ్డి రాంమోహన్ రెడ్డి ...పిటిషనర్
మరియు
కమ్మం కోటేశ్వరరావు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్
టు
రెస్పాండెంట్ నెం.18: బొల్లిపోగు రాంబాబు @ చంటి, S/o. జెమ్స్, వయస్సు 41 సం॥రాలు, వృత్తి:వ్యాపారం, R/o.ఇ.నెం.2-71, ప్రగతి నగర్, విస్సన్నపేట మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్.
రెస్పాండెంట్ నెం.25: కాకుమాన్ శ్రీనివాసరావు, S/o. శంకర్ రావు, వయస్సు 39 సం॥లు, వృత్తి: వ్యాపారం, R/o.ఇ.నెం.5-55/1, బెల్లానపల్లి గ్రామం, నూజివీడు మండలం, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్

సదరు కేసు మీ హాజరు కొరకు ది.13-07-2023 న ఉ॥ 10-30 ని॥లకు వాయిదా కలదు. హాజరు కాని యెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

//కోర్టు వారి అనుమతితో//

వాయిదా తేది:13-07-2023
కొత్తగూడెం,
26-06-2023

ఇట్లు
అంబటి రమేష్,BA., LL.B.,
పిటిషనర్ తరుపు న్యాయవాది,
కొత్తగూడెం, సెల్.నెం.9849347620.

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
IA No.620/2019 in OSNo.125/2019

Between
Dasi Lakshmi @ Mahalakshmi and another ...Petitioner/Plaintiff
And
Matta Mariyamma @ Machamma @ Dasi Mahalakshmi and 9 Others ...Respondants/Defendants
TO,
Resp.No.8: Dasi Nageswaramma W/o Late Dasi Babu Rao(Alleged): a/a 69 years.
Resp.No.9: Darsi Sudhakar S/o Late Dasi Babu Rao(Alleged): a/a 46 years.
Resp.No.10: Gotru Sujatha D/o Late Dasi Babu Rao(Alleged): a/a 48 years.
R/o D.No.3-2, Bokkavari Street, Gudivada, Krishna(Dist)521301.

పై నెంబరు గల దావా నందు ప్రతివాదులైన మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.13-07-2023 వ తేదీన ఉన్నది. కావున సదరు ది.13-07-2023 వ తేదిన ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడును అని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:13-07-2023

S.MALLESWARA RAO,
ADVOCATE,
II Floor, 1st Charmber, A.S.Rama Rao
Governorpet, Vijayawada-520002.
Mobile No.9948092949

IN THE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIJAYAWADA
OSNo.125/2019

Between
Dasi Lakshmi @ Mahalakshmi and another ...Plaintiff
And
Matta Mariyamma @ Machamma @ Dasi Mahalakshmi and 9 Others ...Defendants
TO,
Def No.8: Dasi Nageswaramma W/o Late Darsi Babu Rao(Alleged): a/a 69 years.
Def No.9: Dasi Sudhakar S/o Late Dasi Babu Rao(Alleged): a/a 46 years.
Def No.10: Gotru Sujatha D/o Late Dasi Babu Rao(Alleged): a/a 48 years.
R/o D.No.3-2, Bokkavari Street, Gudivada, Krishna(Dist)521301.

పై నెంబరు గల దావా నందు ప్రతివాదులైన మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా ది.13-07-2023 వ తేదీన ఉన్నది. కావున సదరు ది.13-07-2023 వ తేదిన ఉదయం గం॥ 10-30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని లేదా మీ న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు ఉన్న తెలుపుకోవలెను. లేని యెడల మీ పరోక్షమున కేసు తీర్మానించబడును అని తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదా తేది:13-07-2023

S.MALLESWARA RAO,
ADVOCATE,
II Floor, 1st Charmber, A.S.Rama Rao
Governorpet, Vijayawada-520002.
Mobile No.9948092949

ప్రకటన
మహారాజశ్రీ 13వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి, కృష్ణా, విజయవాడ.
I.A.No. 799/2019, I.A. No. 800/2019, I.A. No. 801/2019 In O.S. No. 5/2014

మద్దినేని పద్మావతి ... పిటీషనర్ / వాది
మరియు
1. మైనంపాటి వెంకట సుబ్బయ్య (డైడ్)
2. మైనంపాటి రమణయ్య మరియు 7 గురు ఇతరులు ... రెస్పాండెంట్లు

టు
1) మైనంపాటి రజని, భర్త లేటు మైనంపాటి వెంకటేశ్వర్లు **(ఆర్6)**
2. వేమూరి శ్రీలత భర్త రాజేష్, తండ్రి లేటు మైనంపాటి వెంకటేశ్వర్లు .. **(ఆర్8)**
3. పుతుంబాక శిరీష, భర్త విజయవర్ధన్, తండ్రి లేటు మైనంపాటి వెంకటేశ్వర్లు ... **(ఆర్9)**
డోర్ నెం.76-5-16, భగత్‌సింగ్‌రోడ్డు, భవానీపురం, విజయవాడ.

పై నెంబరు పార్టీషన్ దావా నందు నాల్గవ ప్రతివాది మైనంపాటి వెంకటేశ్వర్లు ది. 1-3-2019న చనిపోయి నందున వారసులను పై దావాలో పార్టీలుగా చేర్చ గలందులకు పిటీషన్ దాఖలు చేసుకొనందులకు జరిగిన ఆలస్యంగాను మన్నించమని లిమిటేషన్ యాక్ట్ సెక్షన్ 5 క్రింద పిటీషనర్ దాఖలు చేసిన ఐ.ఎ. నెం. 799/2019 పిటీషన్ నందు, ఎబిట్‌మెంట్ రద్దు పరచవలసినదిగా దాఖలు చేసిన (2) ఐ.ఎ. నెం. 800/2019 పిటీషన్ నందు మరియు 4వ ప్రతివాది వారసులను పార్టీలుగా చేర్చగలందులకు దాఖలు చేసిన (3) ఐ.ఎ. నెం. 801/2019 పిటీషన్ నందు, పైన తెలిపిన ఆర్6, ఆర్8, ఆర్9 రెస్పాండెంట్స్‌కు పేపరు ప్రకటన ద్వారా నోటీసు నిమిత్తం కోర్టువారు ఉత్తర్వులు జారీచేసినందున పై నెంబరు 3 పిటీషన్లు నందు అనగా ఐ.ఎ. 799/2019, 800/2019, 801/2019, 6, 8,9 రెస్పాండెంట్లకు తెలియజేయునది ఏమనగా ది.3-7-2023వ తేదీ ఉదయం 10 గం.లకు పై కోర్టు నందు స్వయంగా గానీ, లేదా మీ తరపున న్యాయవాది ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు వున్న యెడల తెలియజేసుకొనగలరు. లేనిచో సదరు పిటీషన్లను మీ పరోక్షంలో తీర్మానించగలరని యిందుమూలముగా తెలియజేయటమైనది.

(కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)
వాయిదాతేది: 3-7-2023

ఇట్లు
సి.వి.ఎస్. సుధాకరరావు,
పి.పి.ఎన్.లక్ష్మి,
విజయవాడ **న్యాయవాదులు,**
తేది: 26-6-2023 **పోరంకి, విజయవాడ.**
సెల్ : 9490148374.

KONDAPALLI MUNICIPALITY : KONDAPALLI

Tender Notice No. 4561427/2023-E1 Dt.26-6-2023

e-Procurement Tender Notice

1. No. of Works : 2 No
2. Total Value of Works : Rs. 7,76,151-00
3. Bid Document Download Starting Date : 27-06-2023, 11-00 AM
4. Bid Document Download End Date : 30-06-2023 & 13-07-2023, 3.00 PM
5. Last Date & Time for receipt of bids 30-06-2023 & 13-07-2023, 03.00 PM
5. Bid Opening Date : 30-06-2023 & 13-07-2023, 03.31 PM

Further details can be see @ e-Procurement market place at www.tender.apeprocurement.gov.in

Sd/- Commissioner,
Kondapalli Municipality :Kondapalli.

ఉపాధి కూలీల సమస్యల పరిష్కారానికి వినతి


చల్లపల్లిలో...


గుడ్లవల్లేరులో...

ప్రజాశక్తి-చల్లపల్లి : ఉపాధి కూలీ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక ఎంపీడీవో చిన్న రాట్నాలకు వ్యవసాయ కార్మిక సంఘం నేతలు సోమవారం పలు సమస్యలతో కూడిన వినతి పత్రం సమర్పించారు. చట్ట ప్రకారం ఉపాధి కూలీలకు వంద పని దినాలు చూపించవలసిన ఉండగా సగటున 20 రోజులు కూడా చూపించడం లేదని వివరించారు. ఉపాధి హామీ చట్ట ప్రకారం పని చూపించలేకపోయిన వారికి నిరుద్యోగ భతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. 200 రోజులు పని దినాలు కల్పించాలని, రోజువారి వేతనం 600 రూపాయలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. గతంలో మాదిరి ఉపాధి కూలీలకు పలుగు పారా, మంచినీళ్ల మరియు వేసవి అలవెన్సులు ఇవ్వాలని కోరారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు నెలవారి 26 వేల రూపాయల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యద్దనపూడి మధు, మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి బండారు కోటేశ్వరరావు, మండల నాయకులు బళ్ళ వెంకటేశ్వ రరావు, మేడేపల్లి వెంకటేశ్వరరావు, జి బిక్షం, మహమ్మద్ కరీముల్లా, కలపాల దానయ్య గోల సాంబశివరావు పాము నాంచారయ్యలు ఉన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు :** ఉపాధిహామీ పథకంలో పెండింగ్ డబ్బులు వెంటనే వేయాలని, ఆన్ లైన్ మస్తరు కాకుండా గతంలో మాదిరిగా చేతి మస్తరు వేయాలని డిమాండ్ చేస్తూ అంగలూరు గ్రామ కమిటీ ఆద్వర్యంలో సోమవారం సచివాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. మండల నాయకులు బి.వి.శ్రీనివాసరావు, గ్రామకమిటీ కార్యదర్శి చాట్ల జగదీష్. కమిటీ సభ్యులు చిలుముల దుర్గ, తంగిరాల రమేష్, కౌలు రైతు సంఘం మండల గౌరవ అధ్యక్షులు మామిడి బాబూరావు, ఉపాధ్యక్షులు ఇదా అన్నారావు, జంగం మరియమ్మ, ఓగిరాల పద్మ, చప్పిడి వీరమ్మ, సుకన్య పాల్గొన్నారు. **ప్రజాశక్తి - మొవ్వ :** ఆంధ్ర ప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మొవ్వ కమిటి ఆధ్వర్యంలో ఉపాధి హామీ కార్మికులు స్దానిక ఎంపిడిఓతో సామూహిక రాయబార కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ప్రతి జాబ్ కార్డుకు 100రోజుల పని దినాలు ఖచ్చితంగా ఇవ్వాలని లేని పక్షంలో బృతి ఇవ్వాలని, మేట్లకు 5వేల రూపాయిలు పారితోషకం ఇవ్వాలని, ఉపాధి కూలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి మృతి చెందిన కార్మికులకు 5లక్షలు ఎక్స్‌గ్రేసియా అందించాలని కోరుతూ రూపొందించిన వినతి పత్రాన్ని అందించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు, కొనళ్ళ రాంబాబు, వనజ, ఎన్. రాంతులసి, నాగమల్లేశ్వరి, నాగలక్ష్మి, లాజరు, పి. వెంకటేశ్వరరావు, పద్మకుమారి పాల్గొన్నారు.


మొవ్వలో వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

1 నుంచి 'జగనన్న సురక్ష' ప్రారంభం


ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ మండలంలో జగనన్న సురక్ష కార్యక్రమం ఆయా గ్రామాల సచివాలయాల పరిధిలో జులై ఒకటో తేదీ నుండి 28వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఇంచార్జ్ ఎంపీడీవో పి శైలజ కుమారి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ జులై 1న అసురపాలెం గ్రామంలో, ఐదో తేదీన అవనిగడ్డ ఒకటి సచివాలయం పరిధిలో, ఏడో తేదీన-2 సచివాలయం పరిధిలో, 12ను3 సచివాలయం పరిధిలో, 14వ తేదీన 4 వా సచివాలయం పరిధిలో, 19వ తేదీన 5 సచివాలయం పరిధిలో, 21న దక్షిణ చిరువాలంక, 24న వేకనూరు, 26న బోదుమూడి, 28న పులిగడ్డ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఇన్చార్జి ఎంపీడీవో పి శైలజ కుమారి తాసిల్దార్ ఎల్ వి ఎస్ రామకష్ణ ఆర్ ఐ కె శ్రీనివాస్ తో పాటు గహ సారధులు వాలంటీర్లు తోపాటు సచివాలయం కన్వీనర్లు కూడా పాల్గొంటారని ఎంపీడీవో చెప్పారు. అయితే మూడు రోజులు ముందుగానే మండల పరిధిలోని అశ్వరావుపాలెం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు.



ఆంజనేయులకు నివాళులర్పిస్తున్న జర్నలిస్టులు

అంబటి ఆంజనేయులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : సీనియర్ జర్నలిస్ట్ ఐజేయు నాయకులు అంబటి ఆంజనేయులుకు దివిసీమ జర్నలిస్టులు నివాళులర్పించారు. సోమవారం అవనిగడ్డ ప్రశ్న ఆధ్వర్యంలో అంబటి మతికి శ్రద్ధాంజలి ఘటించారు ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ లో అంబటి చిత్రపటానికి రాష్ట్ర అధ్యక్షులు అప్పికట్ల శ్రీనివాసరావుతో పాటు పలువురు జర్నలిస్టులు పూల దండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ కార్యదర్శి పుట్టి శ్రీనివాసరావు, సీనియర్ జర్నలిస్టులు కోట సుబ్బారావు, కోట యూ రీ గగారిన్, అలపర్తి గోపాలకష్ణ, గడ్డిపాటి సుధీర్ బాబు తదితరులు పాల్గొన్నారు



నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : కృష్ణా జిల్లా టూ వీలర్స్ మెకానిక్ వర్కర్స్ నూతన కార్యవర్గం ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర అధ్యక్షులు దామినేని ధర్మ తెలిపారు. స్థానిక మార్కెట్ యార్డులో బైక్ మెకానిక్ వర్కర్స్ యూనియన్ గుడ్లవల్లేరు మండల అధ్యక్షులు శాయన నాగేశ్వరరావు అధ్యక్షుతన ఏర్పాటుచేసిన తొలి సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బియాస్ 6 వాహనాలు మార్కెట్లోకి రావడంతో టూ వీలర్స్ మెకానికల్ వర్కర్లకు ఉపాధి కోల్పోయారని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు సహకరించాలని కోరారు. టు వీలర్స్ మెకానిక్ వర్కర్ యూనియన్ జిల్లా అధ్యక్షునిగా ఎండి అక్బర్ భాష ఉయ్యూరు, ప్రధాన కార్యదర్శిగా ముక్తి వెంకటేశ్వరావు బంటుమిల్లి, గౌరవ అధ్యక్షులుగా బి అంకాల సుబ్బారావు మచిలీపట్నం, ఉపాధ్యక్షులుగా కె వెంకట సుబ్బారావు మచిలీపట్నం, చెవిటి రాజేంద్ర ప్రసాద్ అవనిగడ్డ, ఎండి ఆన్సర్ రా గుడివాడ, కార్యదర్శిగా సయ్యద్ మహబూబ్ సుభాని గుడ్లవల్లేరు, కోశాధికారిగా ఉస్మాన్ షరీఫ్ చల్లపల్లి, సంయుక్త కార్యదర్శి ఎస్ కే జానీ పెడన, వచ్చార కార్యదర్శిగా పిఎన్ ఖాన్ ఉయ్యూరు నూతన కమిటీగా నియమితులైయ్యారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : పెనుముచ్చ ప్రాథమికోన్నత పాఠశాలలో 46 వేల రూపాయల నోటు పుస్తకాలను ఎన్నారైలు మొవ్వ పూర్ణచంద్రావు, రాములు అందజేశారని పమిడిముక్కల మండల విద్యాశాఖ అధికారి బి. శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండలంలోని పెనుముచ్చ ప్రాథమికోన్నత పాఠశాలలోని విద్యార్థులకు నోటు పుస్తకాలను అందిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల అభివద్ధికి అందరూ కషి చేయాలని ఆయన అన్నారు. విద్యార్థులు చదువుపై దష్టి పెట్టాలని పెనుముచ్చ గ్రామ సర్పంచ్ దండమూడి అచ్చిమాంబ



అన్నారు. ఎంఇఓ-2 ఎస్. శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ నాయకులు దేవరపల్లి సురేష్, ఎస్‌టియు నాయకులు దేవరపల్లి కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

దళితుల శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి

ప్రజాశక్తి-పమిడిముక్కల: పమిడిముక్కల మండలంలోని కష్ణాపురం దళితవాడకు శ్మశాన వాటిక స్థలాన్ని కేటాయించాలని కోరుతూ లోకాయుక్త సభ్యులు జంపాల శ్రీనివాస్ గౌడ్ మచిలీపట్నంలోని స్పందన కార్యక్రమంలో కలెక్టర్ పి.రాజాబాబుకు ఫిర్యాదు చేశారు. ఐలూరు - కష్ణాపురం రోడ్డు కిరువైపులా మృతదేహాలను పూడ్చడం వల్ల రోడ్డు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుం దన్నారు. ఈ సమస్యను పరిష్కరించకపోవడం వల్ల దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.



వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు : కలెక్టర్

ప్రజాశక్తి-కలెక్టరేట్(కృష్ణా) : కేసరపల్లె జగనన్న లేఅవుట్లకు పోవు మార్గంలో ఏలూరు కాలువపై వంతెన నిర్మాణానికి 3 కోట్ల రూపాయలను రాష్ట్ర ముఖ్యమంత్రి మంజూరు చేసినట్లు జిల్లా కలెక్టర్ పి. రాజా బాబు వెల్లడించారు. సోమవారం నగరంలోని కలెక్టరేట్ స్పందన మీటింగ్ హాల్లో జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గన్నవరం నియోజకవర్గం లోని గన్నవరం మండలం కేసరపల్లి లో ఐదు జగనన్న లేఔట్ లలో పేదలందరికీ ఇళ్ల నిర్మాణం జరుగుతుందన్నారు. ఆ లేఔట్ల నుండి కేసరపల్లి గ్రామానికి వెళ్లాలంటే సరైన మార్గం లేక చాలా ఇబ్బందులు పడుతుండే వారన్నారు. ఈ సమస్యను స్థానిక శాసనసభ్యులు వల్లభనేని వంశీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి దష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందిస్తూ 3 కోట్ల రూపాయలను మంజూరు చేస్తూ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ నిధులతో అంచనాల తయారు చేయించి టెండర్లు పిలిచి త్వరితగతిన పనులు మొదలుపెడతామని తెలిపారు.


మాట్లాడుతున్న కలెక్టర్ పి.రాజాబాబు

నాబార్డ్ పనులు వేగవంతం చేయండి : కలెక్టర్

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : నాబార్డు ఆధ్వర్యంలో ఆర్ఐడిఎఫ్ కింద జిల్లాలో రూ.35457.99 లక్షలతో గ్రామీణ రహదారులు, పాఠశాలల అభివృద్ధి, ఆసుపత్రులకు సంబంధించి 220 ప్రాజెక్టులను చేపట్టినట్లు కలెక్టర్, నాబార్డ్ కన్వీనర్ పి.రాజాబాబు తెలిపారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్లో నాబార్డ్ కష్ణాజిల్లా అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మిలింద్ చౌసాల్కర్ తో కలసి నాబార్డు ద్వారా మంజూరై జిల్లా లో అమలవుచున్న గ్రామీణ మౌలిక వసతుల అభివద్ధి పనులు (ఆర్ ఐ డి ఎఫ్) పై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ వారీగా జరిగిన పనులు, ఖర్చయిన నిధులు, పెండింగ్ ఉన్న పనులను కలెక్టర్ శాఖల వారీగా సమీక్షించారు. జిల్లాలో 12 శాఖలకు సంబంధించిన 220 ప్రాజెక్టను మంజూరు చేయగా ఇంతవరకు 51 ప్రాజెక్టులు పూర్తయ్యాయని, ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్స్టిట్యూషన్స్, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖ, రహదారులు భవనాల శాఖ, ఆర్ డబ్ల్యు ఎస్, సమగ్ర శిక్ష అభియాన్, మహిళా శిశు సంక్షేమ శాఖ కు సంబంధించిన పూర్తయిన ప్రాజెక్టు నివేదికలు అందించాల్సి ఉందని కలెక్టర్ తెలిపారు. ఈ పనుల వేగాన్ని పెంచి ప్రాజెక్టులన్నీ త్వరలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, ఇంకా ప్రారంభం కాని ప్రాజెక్టులను ప్రారంభించాలని తదుపరి సమావేశానికి పూర్తి సమాచారంతో సంబంధిత శాఖల అధికారులు రావాలని జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు సూచించారు. అనంతరం నాబార్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ మిలింద్ చౌసాల్కర్ మాట్లాడుతూ, ఆర్ఐడిఎఫ్ 3 ఏళ్లలో శత శాతం నిధులు బట్వాడా జరగాలని తెలిపారు. ఆలస్యం అయితే ప్రాజెక్ట్ వ్యయం పెరిగే అవకాశం ఉందని అన్నారు. పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖ, పశుసంవర్ధక శాఖ, మత్స్య శాఖ, విద్యా శాఖ, వైద్య శాఖలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కొత్త ఆవిష్కరణలు నేటితరం అందిపుచ్చుకోవాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'భారతీయ విద్యా సేవా సంఘం సమకాలీన వినూత్న విధానాలు' అనే అంశంపై ఆదివారం జాతీయ సదస్సు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి గుంటూరు జిల్లా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు(ఆర్జెడి) డాక్టర్ వి రమా జోత్స్న ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. డిజిటల్ పేమెంట్స్ ఈ కామర్స్ బ్యాంకింగ్ ఇన్సూరెన్స్ రంగంలో వస్తున్న వినూత్నమైన మార్పులు వినియోగదారులకు సులభంగా వేగంగా విభిన్న సేవలను అందించే దిశగా కొత్త ఆవిష్కరణలు నేటి తరం అందిపుచ్చుకోవాలని సూచించారు. ఆన్లైన్ మోసాల పట్ల లోన్ యాప్ ల పట్ల అప్రమత్తులై ఉండాలని తెలిపారు. జనధన యోజన డిజిటల్ కరెన్సీ ఆర్టిజిఎస్ ఎన్జీఎఫ్ పేటీఎం ఫోన్ పే గూగుల్ పే విత్త సేవా రంగంలో వస్తున్న మార్పులకు ఆనవాళ్లు అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్ణీత అంశాలపై పత్ర సమర్పణ చేశారు. వాణిజ్య శాస్త్ర విభాగపు అధ్యాపకులు రాజనాల అంకారావు, బంటుమల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూరగం జగన్మోహన్రావు, వర్షాలోని బరంపురం యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ బి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు



నిర్ణీత అంశాలపై పత్రాలను సమర్పిస్తున్న అధ్యాపకులు



దుర్గగుడి హుండీల ఆదాయం రూ.3.54 కోట్లు

ప్రజాశక్తి-వన్‌టౌన్: దుర్గగుడి మహామండపం ఆరవ అంతస్తులో సోమవారం హుండీల లెక్కింపు కార్యక్రమం జరిగింది. 20 రోజుల్లో యాత్రికులు హుండీల ద్వారా రూ.3,54,87,284 సమర్పించారు. బంగారం 666 గ్రాములు, వెండి 7.752 కిలోలు, ఈహుండీల ద్వారా రూ.36,153 యాత్రికులు సమర్పించారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి దర్భముళ్ల భ్రమరాంబ, పాలకమండలి సభ్యులు చింకా శ్రీనివాసులు, బచ్చు మాధవీ కృష్ణ, దేవాదాయ శాఖ అధికారులు అనూరాధ, కె.సూపద్మా దేవి పర్యవేక్షించారు. ఆషాడ మాసం సంధర్భంగా అమ్మవారికి పవిత్ర సారెను రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.సుజాత సోమవారం సమర్పించారు. ఆలయ అధికారులు ఆమెకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.

కాల్వల పూడికతీత ప్రారంభం

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక 45వ డివిజన్ కబేళా రోడ్డులోని కాలువ పూడికతీత పనులు సోమవారం 45 డివిజన్ వైసీపీ నాయకులు మైలవరపు కష్ణ ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మైలవరపు కష్ణ మాట్లాడుతూ గతంలో ఉన్న పాత కాలువ నుంచి కొత్తగా నిర్మించిన ఎల్అండ్‌టీ కాలువకు అనుసంధానం చేసి మురుగునీటిని మళ్ళిస్తున్నట్లు చెప్పారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ఆయన కోరారు. అలాగే వర్షాకాలం దస్ట్యా ప్రజలు తమ ఇళ్ల వద్ద మురుగునీరు చేరనివ్వకుండా జాగ్రత్తలు వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ మేస్త్రి రామిరెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.





40వ డివిజన్‌లో రూ.18 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి-వన్‌టౌన్: 40వ డివిజన్‌లో సిసి రోడ్లు, డ్రైన్ల నిర్మాణం, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ అలాగే నూతన పైపులైన్ల నిర్మాణం కోసం ఇప్పటివరకూ సుమారు రూ.18 కోట్లు నిధులతో అభివృద్ధి పనులు జరిగాయని స్థానిక కార్పొరేటర్, విఎంసి స్టాండింగ్ కమిటీ మెంబర్ యరడ్ల ఆంజనేయరెడ్డి తెలిపారు. సోమవారం భవానీపురం 40 డివిజన్ అమత అపార్ట్మెంట్ వీధి సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆంజనేయ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు సహకారంతో 40వ డివిజన్‌లో మునుపెన్నడు లేనివిధంగా అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో పానకాల లక్ష్మీనరసింహస్వామి బోర్డు డైరెక్టర్ మల్లెల శ్రీనివాస్ రెడ్డి, 40వ డివిజన్ బీసీ సెల్ అధ్యక్షులు రేగులగుంట రమణయ్య, ఎన్టీఆర్ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు కేసరి కృష్ణారెడ్డి, నాయకులు వైటి రెడ్డి, జయరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

30న ధర్నాలను జయప్రదం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి-సింగ్‌నగర్: పెంచిన కరెంట్ ఛార్జీలు తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీల వసూళ్లు ఆపాలని 61వ డివిజన్లో శాంతినగర్ భాస్కరరావు కొట్టు సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. సమస్యలపై ఇంటింటికి తిరుగుతూ ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ విద్యుత్ ఛార్జీల దోపిడీకి అంతుపొంతు లేకుండా పోతుందన్నారు. స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలను కొల్లగొట్టే పనిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా ఈ నెల 30న విద్యుత్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నగర కమిటీ సభ్యులు చింతల శ్రీనివాస్, జి.సుజాత, నాయకులు ఎస్ వెంకటేశ్వరరావు లీలాసాగర్, మారుతి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-వత్సవాయి: విద్యుత్ భారాలపై మండలంలోని పోలంపల్లి గ్రామంలో కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి తమ్మినేని రమేష్ మాట్లాడుతూ పెరిగిన విద్యుత్ బిల్లులతో జనం గగ్గోలు పెడుతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమ్మక్కై ప్రజలకు షాక్ ఇస్తున్నాయన్నారు. ఉచిత విద్యుత్‌ను క్రమంగా నీరుగారుస్తున్నారని విమర్శించారు. ఈ



61 డివిజన్‌లో...

కార్యక్రమంలో సిపిఎం నాయకులు కంచర్ల కొండయ్య, తమ్మినేని రాంబాబు, పెంటి కోటేశ్వరరావు, కంచర్ల నాగరాజు, ఎస్.మల్లికార్జునరావు, గూటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-భవానీపురం: పశ్చిమ నియోజకవర్గంలోని సితార సెంటర్లో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ నగర కార్యదర్శి జి.కోటేశ్వరరావు మాట్లాడుతూ జగన్ దోపిడీ వల్లే విద్యుత్ చార్జీలు పెరుగుతున్నాయని ధ్వజమెత్తారు. విద్యుత్ బిల్లులను సకాలంలో రీడింగ్ తీయకుండా ఎక్కువ యూనిట్లు వచ్చిన తర్వాత రీడింగ్ తీసి శ్లాబురేటు మార్చి కోట్లలో బిల్లులు వసూలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నగర



సితార సెంటర్‌లో...



వత్సవాయిలో...

సహాయ కార్యదర్శి లంక దుర్గారావు, నక్క వీరభద్రరావు, పంచదార్ల దుర్గాంబ, ఉప్పలపాటి శివప్రసాదరాజు, కంచర్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పని ప్రదేశాల్లో ఫిర్యాదుల కమిటీలు అవసరం

శ్రామిక మహిళల సమస్యలపై స్పందనలో జెసికి వినతి

ప్రజాశక్తి-విజయవాడ: పని ప్రదేశాల్లో వేధింపుల నివారణకు కంప్లైంట్ కమిటీలను ఏర్పాటు చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ ఎ.కమల కోరారు. ఆ మేరకు ఆమె శ్రామిక మహిళా నాయకులతో కలిసి ఎన్‌టిఆర్ జిల్లా జాయింట్ కలెక్టర్ బి.సంపత్‌కుమార్‌కు స్పందన కార్యక్రమంలో సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పని ప్రదేశాల్లో లైంగిక వేధింపులు మహిళల జీవితంలో అంతర్భాగమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళల రక్షణ కోసం 2013 లైంగిక వేధింపుల నిరోధక చట్టాన్ని నేటి ప్రభుత్వాలు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. పని ప్రదేశాల్లో లైంగిక వేధింపుల నివారణకు నోడల్ ఆఫీసర్లను నియమించడం లేదని, అంతర్గత కమిటీలు లేవని, ఎక్కడైనా ఉన్నా అవి నామమాత్రంగా పనిచేస్తున్నాయని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాల్లో వివిధ పబ్లిక్, ప్రైవేట్ సెక్టార్స్‌లో శ్రామిక మహిళలు పనిచేస్తున్న ప్రదేశాలలో అన్ని స్థాయిల్లో కంప్లైంట్ కమిటీలు ఏర్పాటు చేసి, లైంగిక వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. శ్రామిక మహిళలకు కనీస వేతనాలు, సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన



జె.సికి వినతిపత్రం అందజేస్తున్న కమల

వేతనం ఇవ్వాలని, మంచినీళ్లు, మరుగుదొడ్లు, విశ్రాంతి గదులు, క్రేచ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు పి.శ్రీలక్ష్మి, ఇ.దుర్గాలక్ష్మి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు వి.కుమారి, మధ్యాహ్న భోజనం యూనియన్ నాయకులు వై.ఉమా, గవర్నమెంట్ హాస్పటల్స్ స్విపర్స్ యూనియన్ నాయకులు ఎస్‌కె రేష్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-నందిగామ

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులని చేర్పించే బాధ్యత , తల్లిదండ్రులను ఒప్పించే బాధ్యతను ఉపాధ్యాయులు తీసుకోవాలని యుటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. సోమవారం నందిగామ యుటిఎఫ్



మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

కార్యాలయంలో ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందిగామ మండలంలోని వివిధ పాఠశాలలో ఉపాధ్యాయులను కలిసి ప్రభుత్వ పాఠశాలలు బలోపేతానికి కషి ఉపాధ్యాయులు కషి చేయాలని ఉపాధ్యాయులను కోరారు. జిఓ117ను ప్రభుత్వం విద్యా సంస్కరణలలో భాగం తీసుకు వచ్చిందని, దీని ఫలితంగా పాఠశాలల సంఖ్య కుదించటం, ఉపాధ్యాయుల సంఖ్యను కుదించుటకు ప్రయత్నం చేస్తున్నారని విమర్శిం చారు. గత సంవత్సరం ప్రాథమిక పాఠశాలలు నుండి 3,4,5 తరగతులను తొలగించుటవలన ప్రాథమిక పాఠశాలలు బలహీన పడిపోయాయని ఆరోపించారు. 1,2 తరగతులు మాత్రమే ఉన్న పాఠశాలలో విద్యార్థులను చేర్చటానికి వచ్చిన తల్లిదండుడులు సుముఖత చూపడం లేదని తెలిపారు.ఇప్పటికైనా ప్రభుత్వం జిఓ 117 ను రద్దు చేసి ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుటకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆలవాల సుందరయ్య, కోశాధికారి మహేశ్వర వెంకటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్ కుంచం లక్షినారాయణ, నరసింహారావు పాల్గొన్నారు.

అర్జీలను సత్వరమే పరిష్కరించాలి : డిసిపి

ప్రజాశక్తి-విజయవాడ

ప్రజల నుంచి వచ్చిన అర్జీలను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించడానికి ఆయా స్టేషన్ల ఎస్‌హెచ్‌ఒలు చర్యలు తీసుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా రూరల్ డిసిపి అజిత వేజెండ్ల ఆదేశించారు. స్పందన కార్యక్రమం ఎన్‌టిఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం జరిగింది. బాధితుల నుండి వివిధ సమస్యలు, వినతులు, విజ్ఞప్తులకు సంబంధించి డిసిపి నేరుగా అర్జీలు స్వీకరించారు. సమస్యలను త్వరగా పరిష్కరించాలని జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశాలు జారీ చేశారు.

అర్జీల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ

జగనన్న సురక్ష నమోదు ప్రక్రియ, స్పందన, జెకెసి అర్జీల పరిష్కారానికి నాణ్యతతో కూడిన పని తీరు చూపాలని నగర కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. స్థానిక విఎంసిలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో స్పందన కార్యక్రమం నగర కమిషనర్ అధ్యక్షతన సోమవారం జరిగింది. నగరంలోని ఆయా ప్రాంతాల నుంచి ప్రజలు వారు ఎదుర్కొంటున్న సమస్యలపై 21 అర్జీలు కమిషనర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందనకు వచ్చే ఫిర్యాదులను విభాగాధిపతులే నేరుగా పరిశీలించి పరిష్కరించాలని ఆదేశించారు. ఏ ఒక్క ఫిర్యాదు కూడా పునరావతం కాకుండా శాశ్వత ప్రాతిపదికన పరిష్కారానికి కషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

